ప్రభుత్వం ప్రకటించిన అంశాల వారీ రాష్ట్రంలో జిల్లా స్థానం

అత్యధిక అర్జీల స్వీకరణలో	: 5వ స్థానం
సక్రమంగా అర్జీల పరిశీలన (ఆడిట్)లో	: 6వ స్థానం
అర్జీల పరిష్కారంపై సంతృప్తి (స్టార్ రేటింగ్)	: 21వ స్థానం
ఇతరులకు ఈ విధానాన్ని సిఫార్సు చేయడం	: 14వ స్థానం
పరిష్కారంలో యంత్రాంగం అమర్యాదకర ప్రవర్తన	: 3వస్థానం
మొత్తం జిల్లాలో పీజీఆర్ఎస్ ప్రక్రియ అమలు తీరు	: 15వ స్థానం


11-15 గంటలకు
పెద్దారవీడు మండల కార్యాలయం
హాజరైన అంగన్‌వాడీ సూపర్ వైజర్ లక్ష్మీదేవి, ఒక అధికారి

వినతులు ఎక్కువ.. పరిష్కారం అంతంతమాత్రమే. ఇదీ జిల్లాలో 'మీకోసం' తీరుతెన్ను. పెద్దసంఖ్యలో అర్జీలను స్వీకరిస్తున్న అధికార యంత్రాంగం వాటిపై తదుపరి చర్యలు తీసుకోవడంలో మాత్రం ప్రజల మన్ననలు పొందలేకపోతోంది. ప్రజల వద్దకు అధికారులు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నా ప్రయోజనం శూన్యం. ప్రధానంగా రెవెన్యూ యంత్రాంగం తీరు వల్లే ఎక్కువగా సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. వారే తిరిగి పరిష్కరించాల్సి వస్తుండటంతో సరైన చర్యలు తీసుకోవడం లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అధికభాగం అర్జీలను పరిష్కరించినట్లు అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ ప్రజానీకం మాత్రం అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది.

పరిష్కారం అంతంతే!



మొక్కుబడిగా మారిన 'మీకోసం' వినతులు
సమస్యల పరిష్కారంలో యంత్రాంగం తీరుపై పెదవి విరుస్తున్న ప్రజానీకం
ప్రజల సంతృప్తిలో 21వ స్థానంలో జిల్లా
మొత్తం ప్రక్రియలో రాష్ట్రంలో 15వ స్థానం
ఇటీవల కలెక్టర్ల సమావేశంలో పీజీఆర్ఎస్ గణాంకాలను వెల్లడించిన ప్రభుత్వం

ఒంగోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టమ్-పీజీఆర్ఎస్) పేరుతో ప్రభుత్వం ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి గ్రామ స్థాయిలోని సచివాలయం వరకు వివిధ స్థాయిల్లో ప్రజల సమస్యల పరిష్కారం లక్ష్యంగా వినతులు స్వీకరిస్తోంది. వాటిని నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించింది. దీనిపై నిరంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో పర్యవేక్షణ జరుగుతోంది. అలాంటి కీలకమైన ప్రక్రియ అమలు తీరుపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక సర్వే చేపట్టి అందుకు సంబంధించి జిల్లాల వారీ గణాంకాల వివరాలను ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో వెల్లడించింది. అందులో పలు ప్రామాణికాల ఆధారంగా మొత్తం ప్రక్రియపై ఇచ్చిన ర్యాంకింగ్‌లో రాష్ట్రంలో 15వ స్థానంలో జిల్లా ఉంది. ప్రక్రియ తీరు పట్ల ప్రజల సంతృప్తిలో 21వ స్థానానికి పడిపోయింది.

యంత్రాంగం ప్రవర్తన సరిలేదు

ఇప్పటివరకు జిల్లాలో 34,843 అర్జీలు పరిష్కరించినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. అందులో సంతృప్తికి ఫైవ్ స్టార్, అసంతృప్తికి సింగిల్ స్టార్ రేటింగ్‌ను ప్రభుత్వం ఇచ్చింది. సంతృప్తిలో 21వ స్థానంలో జిల్లా ఉంది. సుమారు 40.60శాతం మంది పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తం చేయగా, 7.50 శాతం మంది మాత్రమే సంతృప్తిని తెలిపారు. మిగిలిన 52శాతం మంది అభిప్రాయాలను వెల్లడించలేదు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అర్జీదారులతో అమరావతి నుంచి పీజీఆర్ఎస్ అమలు తీరుపై ఫోన్‌ల ద్వారా ప్రభుత్వం సర్వే నిర్వహించి ఈ తరహా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టింది. అందులో సమస్యల పరిష్కార సమయంలో అధికార యంత్రాంగం తీరు ఎలా ఉందన్న ప్రశ్నకు జిల్లాలో 37శాతం మంది ప్రవర్తన సరిలేదని అభిప్రాయపడ్డారు. మరో 17శాతం మంది అసలు తమ అర్జీలను అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఒక్కరు మాత్రమే చాలా బాగుందని, 46శాతం మంది బాగుందని చెప్పినట్లు ప్రభుత్వం గణాంకాలలో పేర్కొంది.

సమస్యల పరిష్కారంపై ప్రజాభిప్రాయ సేకరణ

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. మొత్తం జిల్లాల వారీగా జూన్ 15 నుంచి (ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టిన) ఇప్పటి వరకు వచ్చిన అర్జీల సంఖ్య, సకాలంలో వాటిని పరిష్కారం చేస్తున్నారా.. ప్రజలు సంతృప్తి చెందుతున్నారా? ఈ విధానాన్ని ఇతరులకు సిఫార్సు చేస్తారా? సమస్యల పరిష్కారం సమయంలో యంత్రాంగం ప్రవర్తన ఎలా ఉంది, మర్యాద ఇస్తున్నారా? వంటి ప్రశ్నలపై అభిప్రాయాలను స్వీకరించింది. ఆ సమాచారాన్ని, తమ వద్ద ఉన్న గణాంకాలతో సరిచూసి పీజీఆర్ఎస్ ప్రక్రియ అమలు తీరుపై జిల్లాలకు ర్యాంకింగ్‌ను ఇచ్చింది. ఎక్కువ అర్జీల స్వీకరణ, సకాలంలో వాటిని పరిష్కరించడం, క్వాలిటీ, వీఐపీల నుంచి అందే వినతుల పరిష్కారం, అందులో క్వాలిటీ వంటి ఐదు అంశాలను ప్రామాణికంగా తీసుకుంది. ఒక్కో అంశానికి 20 వంతున 100 పాయింట్లకు జిల్లాల వారీగా బేరీజు వేయగా అందులో మన జిల్లాకు 68.86శాతం మాత్రమే లభించింది. తద్వారా మొత్తం ప్రక్రియ అమలులో జిల్లా 15వ స్థానానికి పరిమితమైంది.


12 గంటలకు
పెద్దారవీడు మండల కార్యాలయం
తహసీల్దార్‌కు సమస్యను తెలిపేందుకు వేచి ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త

ప్రహసనంగా 'మీ కోసం'

హాజరుకాని వివిధ శాఖల అధికారులు
రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు

పెద్దారవీడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'ప్రజల వద్దకే అధికారులు వస్తారు... సమస్యలు పరిష్కరిస్తారు... మొబైల్ యాప్ ద్వారా మీకు కావాల్సిన సేవలనందిస్తారు. యాప్‌లో మెసేజ్ పంపితే మీ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ముందుకొస్తారు' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయితే ఆయన లక్ష్యాలకు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమానికి అధికారులు సక్రమంగా హాజరు కావడం లేదు. దీంతో కార్యక్రమ ఉద్దేశం నీరుగారుతోంది.

హాజరుకాని అధికారులు

పెద్దారవీడు తహసీల్దార్ కేంద్రంలో నిర్వహించాల్సిన మీ కోసం కార్యక్రమం సోమవారం జరగలేదు. టీవీలు, నెట్‌వర్క్ సమస్యల కారణంగా కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరానికి మార్చారు. అక్కడ టీవీ, నెట్‌వర్క్ సమస్యలేవీ తలెత్తలేదు. కానీ ఇద్దరు మినహా ఎవరూ హాజరుకాలేదు. ఉదయం 10 గంటలకు మండల సర్వేయర్ గోపాలరెడ్డి మీకోసం కార్యక్రమానికి హాజరుకాగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి 11.15 గంటలకు వచ్చారు. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయశాఖ ఏవో, గృహనిర్మాణ శాఖ ఏఈ, పశుసంవర్థక, ఇతర శాఖల అధికారులు ఎవరూ హాజరుకాలేదు. పెద్దారవీడు చెంచు కాలనీలోని సమస్యలను తహసీల్దార్‌కు చెప్పుకోవడానికి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్త వేచి చూసి వెనుతిరిగి వెళ్లిపోయారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమానికి రాని పలువురు అధికారులు హాజరైనట్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోనే రిజిస్టర్ ఉండడంతో అక్కడే సంతకాలు చేశారు.

తీవ్ర ఆందోళనకరమే..

అధికారుల ప్రవర్తన బాగా లేదని ఎక్కువమంది ప్రజానీకం చెప్పిన జిల్లాల్లో మూడో స్థానంలో మన జిల్లా ఉంది. వినతులు అధికంగా స్వీకరించి రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. మర్యాదగా అధికారుల ప్రవర్తన లేదన్న దానిలో మన జిల్లా 3వ స్థానంలో ఉండడం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం పట్ల యంత్రాంగం ప్రవర్తన ఎలా ఉందో అర్థమవుతోంది. ప్రజలు తమ సమస్యల పరిష్కారం పట్ల సంతృప్తి చెందడంలో జిల్లా 21వ స్థానంలో ఉండటం, వీఐపీల నుంచి అర్జీలు తీసుకోవడంలో 20 పాయింట్లకు 19.50 మార్కులు అధికారులకు వచ్చినప్పటికీ క్వాలిటీగా పరిష్కరించడంలో 7.24 పాయింట్లు మాత్రమే లభించడం తీవ్ర ఆందోళనకరంగా కనిపిస్తోంది.

అడ్డుకున్న అటవీశాఖ అధికారులు
నేడు ఆర్డీవోతో చర్చలు


రెండురోజుల క్రితం పనులు ఆపి పక్కన ఉంచిన ఎక్స్‌కవేటర్లు

మూడో రోజూ ఆగిన సీబీజీ ప్లాంట్ పనులు

కురిచేడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ పనులు వరుసగా మూడోరోజూ నిలిచిపోయాయి. సంస్థకు కేటాయించిన భూమి విషయమై రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న వివాదం పరిష్కారం కాకపోవడమే ఇందుకు కారణమైంది. కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటుకు 799.40 ఎకరాలు కేటాయించారు. ఇందులో ఉన్న చెట్లను రిలయన్స్ సంస్థ ఎక్స్‌కవేటర్లతో తొలగించే పనులు చేపట్టింది. ఈక్రమంలో అటవీ అధికారులు రంగప్రవేశం చేశారు. సదరు భూమి తమ శాఖదంటూ పనులు నిలిపివేయించారు. సోమవారం జిల్లా అటవీ శాఖాధికారి కలెక్టర్‌ను కలిశారు. మంగళవారం కనిగిరి ఆర్డీవోతో చర్చించాలని కలెక్టర్ డీఎఫ్‌వోకు సూచించారు.

కొలతలు వేసిన అటవీశాఖ అధికారులు

గంగదొనకొండలో 88, 90 సర్వే నంబర్లలో 799.40 ఎకరాల భూమిని సీబీజీ ప్లాంట్‌కు కేటాయించారు. దీంతో రిలయన్స్ సంస్థ ప్రతినిధులు పనులు ప్రారంభించారు. యంత్రాలతో భూమిలోని చెట్లను తొలగించి చదును చేసే పనులను చేపట్టారు. ఈనేపథ్యంలో అటవీ శాఖ అధికారులు రంగప్రవేశం చేశారు. ఆ భూమి తమదంటూ శనివారం పనులను అడ్డుకున్నారు. సోమవారం సైతం అటవీ శాఖాధికారులు పెద్దసంఖ్యలో వచ్చి కొలతలు వేసే పని చేపట్టారు. జీపీఎస్ ద్వారా జియో ట్యాగింగ్ చేశారు. ఆ వివరాలను జిల్లా అటవీ శాఖాధికారికి పంపగా ఆయన కలెక్టర్ అన్సారియాను కలిసి వివరించారు. ఆమె మంగళవారం కనిగిరి ఆర్డీవోను కలిసి చర్చించాలని సూచించారు. దీంతో రెండు రోజులుగా పనులు నిలిచిపోయాయి. మంగళవారం ఆర్డీవోతో సమావేశం తరువాత సమస్య ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. పనులు ఆలస్యమవుతుండటంతో ఎక్స్‌కవేటర్ల యజమానులు యంత్రాలను అక్కడి నుంచి తీసుకెళ్లారు.

భూమి తమదే అంటున్న రెవెన్యూ అధికారులు

రెవెన్యూ అధికారులు మాత్రం ఆ భూమి పూర్తిగా తమదేనని అంటున్నారు. ఎఫ్ఎల్ఆర్‌లో గయాలు అని ఉందంటున్నారు. అలాంటి భూమిని అటవీ శాఖాధికారులు వారిది అని ఎలా అంటున్నారో అర్థంకావడం లేదన్నారు. వారి వద్ద ఉన్న రికార్డులు తీసుకురావాలని కోరుతున్నారు. పెద్ద పరిశ్రమ వచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే సమయంలో అడ్డుకోవడం ఏమిటని అటవీ శాఖాధికారులను ప్రశ్నిస్తున్నారు. సోమవారం సీబీజీ ప్లాంట్ వద్దకు వచ్చిన అటవీ శాఖాధికారులలో ఒంగోలు రేంజ్ ఆఫీసర్ బి.నరసింహారావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కేబీ నాయక్, బీట్ ఆఫీసర్ ధనలక్ష్మి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ అచ్చిరెడ్డి ఉన్నారు.


సీబీజీ ప్లాంట్ వద్ద అటవీ అధికారులు


నీటి సంపును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ట్రిపుల్ ఐటీలో దాహం కేకలు..!

మూడు రోజులుగా నీటి కోసం అగచాట్లు
పట్టించుకోని కాలేజీ అధికారులు
ఎమ్మెల్యే దామచర్ల ఆదేశాలతో కదిలిన కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల నుంచి కాలేజీ క్యాంపస్‌లో నీరు లేకపోవడంతో అల్లాడిపోతున్నారు. పట్టించుకోవాల్సిన కాలేజీ ఏవో, డైరెక్టర్లు ప్రభుత్వ సెలవుల పేరు చెప్పి పత్తా లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకెళితే.. ఒంగోలులోని దక్షిణ బైపాస్ రోడ్‌లోని ఆర్‌జీయూకేటీ క్యాంపస్-3లో విద్యుత్ మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. మరోవైపు పదేపదే విద్యుత్ సమస్య వేధిస్తోంది. కొన్నిబ్లాక్‌లలో ఫ్యాన్లు పనిచేయడం లేదు. నీటి సమస్య కారణంగా మూడు రోజులకు ఒకసారి కూడా స్నానం చేసే పరిస్థితి లేదు. ప్రత్యేకించి శ్రీరామనవమి పండుగరోజు కూడా నీటి కోసం అల్లాడిపోయారు. మూడురోజులుగా తాము ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా శని, ఆదివారాలలో వారు సెలవు పేరుతో అందుబాటులో లేరు. దీంతో సోమవారం నిరసనకు దిగారు.

ట్రిపుల్ ఐటీని సందర్శించిన కార్పొరేషన్ అధికారులు

ట్రిపుల్ ఐటీలో సమస్యలు, విద్యార్థులు పడుతున్న అవస్థలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వెంటనే స్పందించారు. నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో నగర కమిషనరు కె.వెంకటేశ్వరరావు, ఎంఈ చంద్రయ్యతోపాటు పలువురు ఇంజనీరింగ్ అధికారులు ట్రిపుల్ ఐటీ కాలేజీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

సమస్యకు గల కారణాలను గుర్తించిన వారు తక్షణమే కార్పొరేషన్‌కు చెందిన ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయించారు. కాలేజీలోని సంప్‌లో నీటిని నిల్వ చేయించారు. అలాగే పాడైపోయిన మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తామని కమిషనరు విద్యార్థులకు హామీ ఇచ్చారు. అలాగే కాలేజీలోని సమస్యలను ఎమ్మెల్యే దామచర్లకు వివరించడంతోపాటు, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కరువు మండలాల గెజిట్ విడుదల

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల గెజిట్ నోటిఫికేషన్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం విడుదల చేశారు. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి 17 మండలాలను కరువు ప్రాంతాలుగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో పుల్లలచెరువు, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి, కంభం, తర్లుపాడు, పెద్దారవీడు, సంతనూతలపాడు, ఒంగోలు, వెలిగండ్ల, బేస్తవారపేట మండలాలు తీవ్ర కరువు జాబితాలో ఉన్నాయి. కొనకనమిట్ల, మార్కాపురం, చీమకుర్తి, చంద్రశేఖరపురం, పామూరు, రాచర్ల ఒక మోస్తరు కరువు మండలాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఈ మండలాల్లో రైతులకు రుణ సదుపాయం కల్పించడంతోపాటు అవసరమైన సహాయక చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.


ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో పన్నులు చెల్లించేందుకు బారులు తీరిన జనం

పన్నుల చెల్లింపునకు బారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి, నీటి, ఖాళీస్థలాల పన్నులు(2025-26) ముందే చెల్లించే వారికి ప్రభుత్వం 5శాతం రాయితీ ప్రకటించడంతో చెల్లింపులకు జనం బారులు తీరారు. దీంతో సోమవారం కార్పొరేషన్ కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ఏకమొత్తంలో పన్నులు చెల్లించడం ద్వారా 5శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఈ అవకాశం ఈనెల 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. సచివాలయాలలో, కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

అవీ..ఇవీ



పశుసంవర్ధకశాఖ ప్రచురించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

పశుపోషకులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువులకు ఎలాంటి నష్టం జరగకుండా వాటి పోషకులు తగిన జాగ్రత్తలు తీసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం పశుసంవర్ధకశాఖ ప్రచురించిన ప్రత్యేకపోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుగ్రాసం, షెడ్స్‌ల నిర్వహణలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో జేసీ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబిరాణి తదితరులు ఉన్నారు.



వార్షిక వేడుకల కేక్ కట్ చేస్తున్న న్యామతుల్లా, తహురలు

'బ్రిలియంట్' వార్షిక వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అంజయ్య రోడ్డులోని బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం 30వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ న్యామతుల్లా బాషా, మేనేజింగ్ డైరెక్టర్ తహురలు విద్యార్థులు, సిబ్బందితో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో న్యామతుల్లా బాషా మాట్లాడుతూ సాంకేతిక విద్యతో అత్యంత ఉపయోగకరమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ యాప్ డెవలపింగ్, సైబర్ సెక్యూరిటీస్ తదితర కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వంద మంది పేద విద్యార్థులకు జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10లోపు సంస్థ ప్రధాన కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, టీచింగ్, నాన్‌టీచింగ్, విద్యార్థులు ఉన్నారు.



నీటి తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మద్దినేని హరిబాబు

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటితొట్టెల నిర్మాణం

సంతనూతలపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహార్తిని తీర్చే లక్ష్యంతో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నీటి తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అన్నారు. సోమవారం మండలంలోని మద్దులూరు గ్రామంలో నీటితొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో నీటితొట్టె నిర్మాణానికి రూ.33వేలు ప్రభుత్వం ఖర్చుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఉపాధిహామీ ఏపీవో వాసంతి, మద్దులూరు టీడీపీ నాయకులు నువ్వుల మీరయ్య, మండల తెలుగుయువత అధ్యక్షుడు ముప్పరాజు శ్రీను, గ్రామ టీడీపీ నాయకులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు

మద్దిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి రమేష్ బాబు తెలిపారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూమిలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు సూక్ష్మ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

● కలెక్టర్ అన్సారియా హెచ్చరిక



మీ కోసంలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మీ కోసం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈసందర్భంగా అధికారులతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. అధికారులు ప్రతిరోజు లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను పరిశీలించాలన్నారు. సాంకేతిక సమస్యల వల్ల క్షేత్ర స్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టంగా తెలియజేయాలన్నారు. అటువంటి అర్జీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని సూచించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, మాధురి, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి, వివిధశాఖల అధికారులు ఉన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

మీకోసంలో ఎస్పీకి 92 ఫిర్యాదులు

ఒంగోలు క్రైం,ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): బాధితులకు తక్షణ పరిష్కారమే ధ్యేయంగా ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో భాగంగా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి 92 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు. ఈమేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. అధిక సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులలో భూవివాదాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడం లాంటి సమస్యలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, సీఐలు పాండురంగారావు, నాగరాజు, సూర్యనారాయణ, జగదీష్ తదితరులు ఉన్నారు.

విశ్వమానవ సంక్షేమమే మహోన్నత మతం

-బౌద్ధ గురువు యుషీ షావోలిన్

ఒంగోలు కల్చరల్,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):ప్రపంచంలో ఎన్ని మతాలు ఉన్నప్పటికీ అందరి సంక్షేమం కోరేదే గొప్ప మతమని, అదే మానవత్వమని జపాన్‌కు చెందిన ప్రముఖ బౌద్ధ గురువు యుషీ షావోలిన్ అన్నారు. భారతదేశ పర్యటనలో భాగంగా ఆయన శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు బౌద్ధహీన్‌తో కలిసి సోమవారం ఒంగోలు అన్నవరప్పాడులోని శివం శరణాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు అక్కడి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విశ్వశాంతి మహాహోమంలో యుషీ షావోలిన్ పూర్ణాహుతి సమర్పించారు. అదేవిధంగా శరణాలయానికి బౌద్ధభిక్షువులు గోమాతను దానంగా ఇచ్చారు. ఇక శివలింగానికి నిర్వహించిన ఏకాదశ మహారుద్రాభిషేకంలో వారు పాల్గొన్నారు. అనంతరం బాపట్ల ఆదిలక్ష్మి, ఊదరగుడి ఈశ్వరమ్మ, పూనమిల్లి పురందేశ్వరి, పెద్దినేని రమణలకు వైద్యం, జీవనోపాధికి ఏర్పాటుచేసిన ఆర్థిక సహాయాన్ని బౌద్ధభిక్షువుల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా యుషీ షావోలిన్ మాట్లాడుతూ ఏ మతమైనా మానవ కల్యాణానికి సహకరించేదిగా ఉండాలని, తోటి వారికి సహాయం చేయటం, నిత్యం అనాథలకు అన్నదానం చేయటం ఎంతో అభినందనీయమని అన్నారు. అనంతరం వారిని శరణాలయం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, నాగరాజు, సురేష్, తిరుమల, సులోచన, ప్రసన్నకుమారి, రాజ్యలక్ష్మి, శ్రావ్య, వెంకటరత్నం, శ్రీవల్లి, సుబ్బులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పురోహితులు మాగంటి శ్రీనివాస మూర్తి, పురాణం మురళీకృష్ణ, ఈమని శేఖర్ బృందం బౌద్ధభిక్షువులకు ఆశీర్వచనం అందజేశారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న బౌద్ధ భిక్షువులు

క్విస్‌లో డ్రోన్ వర్క్‌షాప్ ప్రారంభం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ వినియోగంపై ఐదు రోజుల బూట్ క్యాంప్ సోమవారం ప్రారంభమైంది. క్విస్ కళాశాల, ఎన్‌ఈటీ సంయుక్తంగా ఈ క్యాంపును నిర్వహిస్తున్నాయి. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సౌజన్యంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి టీఐటీ ప్రొఫెసర్ కౌశిక్‌కుమార్, ఎన్ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ బాలాజీ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. క్విస్ కళాశాల డీసీఎస్ఆర్‌డీ డైరెక్టర్ సుబ్బారావు పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కౌశిక్ కుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో డ్రోన్ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ కళాశాలలో విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణచక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రిదేవిలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీన్ చల్లా రామ్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.



డ్రోన్ వర్క్‌షాప్ ప్రారంభంలో బీఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లు, క్విస్ కళాశాల బృందం

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కల్పించాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని అఖిల భారత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వ్యవసాయం అభివృద్ధికోసం రైతులు, రైతు కూలీల సమైక్యత - అవశ్యకత అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. బి. సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపట్ల రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు జి. సుబ్బయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు, రైతు కూలీల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఈకార్యక్రమంలో క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ చక్రవర్తి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి. హరిబాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎం. హర్షప్రీతమ్ దేవ్‌కుమార్, బోధనేతర సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న అఖిల భారత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ శ్యాంప్రసాద్

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

మద్దిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు ఏపీఎం కాకుమాను సుబ్బారావు తెలిపారు. సోమవారం డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆర్థినీతి జార్ యాప్‌ను అందుబాటులో ఉంచామని స్వయం సహాయక సంఘాలు ఇంటి వద్ద తయారు చేసే అన్ని రకాల ఉత్పత్తుల వివరాలను ఈ యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా మార్కెటింగ్ చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘ మహిళలు, సీసీలు పాల్గొన్నారు.

ఆహార నియమాలతో వ్యాధులు దూరం

పొన్నలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సరైన ఆహార నియమాలు పాటించడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యాధికారులు డాక్టర్ కృష్ణచైతన్య, డాక్టర్ రవికిరణ్ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ ఉమీరా, వైద్యారోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

● రూ.2.83 లక్షల జరిమానా

సింగరాయకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ సెక్షన్ పరిధిలోని విద్యుత్ కనెక్షన్‌లను కందుకూరు డీఈఈ మల్లెల నాగేశ్వరరావు, ఒంగోలు విజిలెన్స్ అధికారి హైమావతి ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా తనిఖీ చేశారు. మొత్తం 35 బృందాలు పాల్గొన్నాయి. విద్యుత్ చౌర్యం, అదనపు లోడ్, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 68 కేసులు నమోదు చేశారు. వారికి రూ.2.83లక్షల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో ఏడీ పి.యుగంధర్, ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

రేపు 'దిశ' సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

గోడ కూలి వృద్ధుడి మృతి

మద్దిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):గోడ కూలి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఉగాది పండుగ రోజున జరగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో వెల్లంపల్లిలో గృహం గుణార్థానికి వెళ్లిన సమయంలో పాత గోడ కూలి ఇద్దరిపై పడింది. ఈ ప్రమాదంలో ముప్పు ఆంజనేయులు(63) మృతి చెందాడని, చిట్టిబోయిన సుబ్బారావు గాయపడ్డాడని మద్దిపాడు ఎస్సై శివరామయ్య తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఆయన సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12వ పీఆర్సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలి

ఒంగోలు (రూరల్), ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి):పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వ పెన్షనర్‌లకు, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల పెంపుదలకు సంబంధించి 12వ పీఆర్సీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం పులి వెంకటరెడ్డి కాలనీలోని రాష్ట్రప్రభుత్వ పెన్షన్‌ల సంఘ భవనంలో సోమవారం ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బడే అంకిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అదేవిధంగా పెన్షనర్లకు డీఆర్, ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మృతి చెందిన పెన్షనర్‌లకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పలువురు సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ కార్యదర్శి కంచర్ల సుబ్బారావు వైస్ ప్రెసిడెంట్‌లు చిల్లర శ్రీరామూర్తి, మహబూబ్ సుభాని, నాయకులు పరిటాల సుబ్బారావు పాల్గొన్నారు



పెన్షనర్లను సన్మానిస్తున్న నాయకులు

విద్యుత్ అదనపులోడు రుసుంలో 50 శాతం రాయితీ

మద్దిపాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అవసరానికి మించి అదనంగా విద్యుత్ వినియోగించుకునే వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం రుసుంపై 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మద్దిపాడు విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి తెలిపారు. గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు కిలోవాట్లు, పట్టణ పరిధిలో మూడు కిలో వాట్లు దరఖాస్తు చేసుకునేలా ముందుకు రావాలని ఆయన కోరారు. విజిలెన్స్ అధికారులు దాడుల సమయంలో అదనపు లోడు గుర్తించి కేసులు నమోదు చేస్తారని అన్నారు. కనుక ఈ రాయితీని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న రామయ్య చౌదరి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

కొండపి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు భవిష్యత్‌లో అవసరమైన పోటీ పరీక్షలు, నూతన కోర్సులపై అవగాహన కలిగించే కార్యక్రమాలను విద్యాశాఖమంత్రి నారా లోకేష్ చేపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి అనేక కంపెనీలను తీసుకువస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, ఆరికట్ల వెంకట్రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



శ్రీరామనవమి సందర్భంగా చీమకుర్తిలో ప్రదర్శిస్తున్న తోలుబొమ్మలాటను తిలకిస్తున్న ప్రజలు

అలరించిన తోలుబొమ్మలాట

● కొత్త అనుభూతి పొందిన ఈతరం వాసులు

చీమకుర్తి,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): సినిమా తెరకెక్కముందు,వందేళ్ల క్రితం ప్రజలకు అత్యంత వినోదాన్ని అందించిన తోలుబొమ్మలాట కళ అంతరించిపోయిందనుకున్న సమయంలో తిరిగి జీవం పోసుకోవటం విశేషం. అరచేతిలో అందరికీ వినోదం చేరువైన వేళ, నేటి స్పీడ్ యుగంలో ఈతరంకు పరిచయం లేని తోలుబొమ్మలాట చీమకుర్తి తిరిగి పురుడు పోసుకోవటం విశేషంగా మారింది. శ్రీరామనవమిని పురస్కరించుకొని చీమకుర్తి పట్టణం నెహ్రూనగర్‌లోని కోదండరామస్వామి ఆలయంలో కార్యనిర్వాహకులు అంతరించిపోయిన కళకు జీవంపోసే కార్యక్రమాన్ని చేపట్టారు. రామాయణ చరిత్రను కళ్లకు కట్టినట్లు నేటి తరానికి తోలుబొమ్మలాట ద్వారా తెలియచేసే ప్రయత్నం సఫలీకృతం అయింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన తోలుబొమ్మలాటను యువకులు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను సైతం పక్కనపెట్టి తిలకించి ఆనందించటం కనపడింది. పిల్లలు,మహిళలు ఆసక్తిగా తోలుబొమ్మలాటను తిలకించి ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. తోలుబొమ్మలాటను ప్రదర్శించిన కనకదుర్గా తోలుబొమ్మలాట కళాబృందంపై ప్రశంసల వర్షాన్ని కురిపించారు.

హైబ్రీడ్ రకం జొన్నల కొనుగోలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా జిల్లాలో రైతులు పండించిన హైబ్రీడ్ రకం జొన్నలు(సీ43/మహీంద్ర రకం)ను కనీస మద్దతుధరతో కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటా రూ. 3,371తో నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తారన్నారు. హమాలీలను రైతులే ఏర్పాటు చేసుకుంటే వారి ఖర్చులను ప్రభుత్వమే అదనంగా ఇస్తుందన్నారు. గోనె సంచులను, జొన్నలను రవాణా చేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను పౌరసరఫరాల సంస్థ భరిస్తుందన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన జొన్నలకు నగదు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తారన్నారు. జొన్న పంట సాగు చేసిన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్, ఈకేవైసీతో పాటు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అటువంటి వారు మాత్రమే అర్హులని జేసీ తెలిపారు.



కంప్యూటర్లను అందజేస్తున్న ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్య

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ల బహూకరణ

చీమకుర్తి,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ల కొరత వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ విషయాన్ని ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్య దృష్టికి తీసుకువెళ్లటంతో ఆయన వెంటనే స్పందించారు.నల్లూరి ఫౌండేషన్ ద్వారా నాలుగు కంప్యూటర్లను సోమవారం శేషయ్య చేతులమీదుగా తహసీల్దార్ బ్రహ్మయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి డీసీ అధ్యక్షుడు పాలడుగు వెంకటనారాయణ, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు,గొట్టిపాటి రాఘవరావు,కాట్రగడ్డ రమణయ్య,రావిపాటి రాంబాబు,కందిమళ్ల గంగాధరరావు,రామినేని యోగయ్య,సర్పంచ్ బక్కా శ్రీనివాసరావు, వేల్పుల వెంకటేశ్వర్లు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణపత్రాలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు ప్రభుత్వం నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక గ్రీవెన్స్ హాలులో సోమవారం ముగ్గురు ట్రాన్స్ జెండర్లకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వినికిడి సమస్య ఉన్న ఒక మహిళకు సహాయపడేలా హియరింగ్ మిషన్‌ను కూడా ఇచ్చారు. ఈకార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి. అర్చన ఉన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.ఆ రోజు ఉదయం 8 గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం పదిన్నర గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో దిశ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.





అగచాట్లు పోయి.. ఆహా అనేలా..

వంద మాటల కన్నా ఒక బొమ్మ మేలు అంటారు. గత వైసీపీ పాలనకూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరుకూ తేడా చెప్పడానికి ఈ దృశ్యాలే నిదర్శనం. యర్రగొండపాలెంలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న వీధి.. గత ప్రభుత్వంలో ఇరుగ్గా ఉండేది. వర్షం పడితే నీరంతా రోడ్డుపైనే నిలిచేది. జనం నడవాలన్నా, వాహనాలు వెళ్లాలన్నా నరకం కనిపించేది. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆవరణ గత ప్రభుత్వంలో అధ్వానంగా అఘోరించేది. గుంతలమయంగా ఉండేది. వర్షం పడితే బురద చేరేది. నడవటానికి వీల్లేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే ఇవన్నీ మారిపోయాయి. రోడ్డు వెడల్పు పెరిగింది. సీసీ రోడ్డుతోపాటు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటైంది. కాలనీ వాసుల కష్టాలు తీరాయి. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులు కాలు తీసి కాలు పెట్టాలంటే భయపడే స్థాయి నుంచి నేరుగా వైద్యశాలలోకి వెళ్లేందుకు సీసీ రోడ్డు ఏర్పాటైంది.

- ఎర్రగొండపాలెం రూరల్, ఆంధ్రజ్యోతి







చింతన్‌శివిర్ సదస్సులో అజెండాపై రాష్ట్ర అధికారులతో చర్చిస్తున్న మంత్రి స్వామి

చింతన్ శివిర్‌కు హాజరైన మంత్రి స్వామి

ఒంగోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో జరుగుతున్న చింతన్ శివిర్ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున జిల్లాకు చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి హాజరయ్యారు. సంబంధిత శాఖ కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ నేతృత్వంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖల మంత్రులతో కేంద్ర ప్రభుత్వం దీనిని నిర్వహిస్తోంది. ఆయా వర్గాల సంక్షేమం కోసం వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలితాలు, ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి తదితర అంశాలపై సమావేశాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమశాఖల కీలక ఉన్నతాధికారులతో కూడిన బృందం మంత్రి డాక్టర్ స్వామి నేతృత్వంలో చింతన్ శివిర్‌కు హాజరైంది. తొలిరోజైన సోమవారం పలు సంక్షేమ పథకాలపై చర్చ జరిగినట్లు సమాచారం. మంగళవారం కూడా ఈ సమావేశం కొనసాగనుండగా మంత్రి డాక్టర్ స్వామి రెండవ రోజు కూడా పాల్గొనున్నట్లు సమాచారం.

టెన్త్ మూల్యాంకన కేంద్రాన్ని సందర్శించిన పరిశీలకులు



పదవ తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఏవీ సుబ్బారెడ్డి సందర్శించారు. మూల్యాంకన కేంద్రంలోని ఏర్పాట్లు పరిశీలించారు. అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం జరుగుతున్న గదులకు వెళ్లి అక్కడ జరుగుతున్న మూల్యాంకనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మార్కులు ఎలా వస్తున్నాయి, ఎంత మంది ఫెయిల్ అయ్యారు, ఎంత మందికి వందకు వంద మర్కులు వస్తున్నాయి, మార్కులు కేటాయిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. 9వ తేదీ నాటికి మూల్యాంకనం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● **కలెక్టర్ పరిశీలన**

ఒంగోలు కలెక్టరేట్ : డీఆర్ఆర్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి మూల్యాంకన ప్రక్రియను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు. 1,78,218 జవాబుపత్రాలను దిద్దాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. స్పాట్ వాల్యువేషన్‌లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు.

నేడు జిల్లాకు పొగాకు బోర్డు ఈడీ

ఒంగోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భారత పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ మంగళవారం జిల్లాకు రానున్నారు. ఐఏఎస్ త్రిపుర క్యాడర్‌కు చెందిన విశ్వశ్రీ గతనెల 19న పొగాకు బోర్డు ఈడీగా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఎనిమిదేళ్ల బోర్డు ఈడీగా పనిచేసిన అద్దంకి శ్రీధర్‌బాబు బదిలీతో ఆమె రాగా బోర్డు ఈడీగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి మంగళవారం జిల్లాకు వస్తున్నారు. ఉదయం 9 గంటలకు త్రోవగుంట సమీపంలోని ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రానికి రానున్న ఈడీ విశ్వశ్రీ అక్కడ కొనుగోళ్ల పరిశీలిస్తారు. అనంతర టంగుటూరు, కొండపి కేంద్రాలను కూడా సందర్శించి వేలం తీరు పరిశీలించి రైతులతో మాట్లాడతారు. మధ్యాహ్నం తర్వాత ఒంగోలు-2, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో రైతులతోనూ సమావేశం అవుతారని సమాచారం.



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య, వెనుకవైపు నిందితులతో పోలీసులు

గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులు అరెస్ట్

● 4.5 కేజీల సరుకు స్వాధీనం ● వివరాలను వెల్లడించిన సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద 4.5 కిలోల సరుకు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. గుంటూరులోని రాజాగారితోటకు చెందిన గాజుల రాజు ఇంజనీరింగ్ చదువుతూ గంజాయికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో ఆయనకు గంజాయిని సరఫరా చేసే ఒడిసాకు చెందిన భీమా ఖొర, అతని స్నేహితుడైన జాఘూ ఖిలతో పరిచయం ఏర్పడింది. తరచూ వారి నుంచి గంజాయిని తెప్పించుకొంటున్నాడు. తాను తాగుతూ మరికొంత గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి ఒంగోలు చుట్టుపక్కల విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో రాజుకి పరిచయం ఉన్న శ్రీకాళహస్తికి చెందిన పల్లం కిరణ్ ఆయనకు నాలుగు రోజుల క్రితం ఫోన్ చేశాడు. ఖర్చులకు నగదు లేక ఇబ్బందులు పడుతున్నానని అమ్ముకోవడానికి 4 కేజీల గంజాయి తక్కువ ధరకు తెప్పించాలని కోరాడు. దీంతో రాజు ఒడిసాకు చెందిన భీమా ఖొరాకు ఫోన్‌చేసి 4 కేజీల గంజాయి కావాలని అడిగాడు. దాన్ని టంగుటూరులోని టాల్‌ప్లాజా వద్దకు తీసుకురావాలని చెప్పాడు. దీంతో భీమా ఖొర. తన స్నేహితుడు ఖాఘూ ఖిలతో గంజాయిని తీసుకొని ఆదివారం రాత్రి ఒడిసా నుంచి బయల్దేరాడు. ఈ విషయాన్ని రాజు శ్రీకాళహస్తికి చెందిన కిరణ్‌కు చెప్పి అతనిని కూడా టంగుటూరు టోల్‌ప్లాజా వద్దకు రమ్మని సూచించాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఖొర, ఖిల ఇరువురూ గంజాయి తీసుకొని టంగుటూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ రాజు వేచి ఉండగా, కొద్దిసేపటికి కిరణ్ కూడా టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నాడు. ఒడిసాకు చెందిన ఇద్దరు యువకులు తెచ్చిన గంజాయి ప్యాకెట్లను రాజు, కిరణ్ పరిశీలిస్తుండగా సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వారిని చూసిన నలుగురు యువకులు అక్కడి నుంచి పరారవుతుండగా పట్టుకున్నారు. 4.5 కిలోల గంజాయిని, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.వెంకటరావు, ఎంవీ కృష్ణారావు, శ్రీను, సుబ్బారెడ్డి, కానిస్టేబుళ్లు మహేష్, నాగార్జున్, జయరాం, రమేష్‌లను ఎస్పీ దామోదర్ అభినందించారు.



చెట్టే షెడ్డు!

కుటుంబ పోషణకు ఆటో మెకానిక్ తిప్పలు

పీసీపల్లి మండలంలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుంటగాని బాబుకు భార్య, కూతురితో పాటు వృద్ధురాలైన తల్లి ఉన్నారు. రోజంతా కష్టపడితే వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్న బాబు రెండేళ్ల క్రితం అనారోగ్యం పాలయ్యాడు. ఆస్పత్రికెళితే బ్రెయిన్ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. తలలో ఉన్న గడ్డలను తొలగించారు. కోలుకున్నాక బుడ్డారెడ్డిపల్లికి వచ్చి కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు తెలిసిన మెకానిక్ పనులు చేయడానికి సిద్ధమయ్యాడు. మండల కేంద్రమైన పీసీపల్లి సెంటరులో షెడ్ కోసం అనుకూలమైన రూమ్‌లను చూశాడు. వాటి అద్దెలు ఎక్కువగా ఉండడంతో గ్రామం చివర ఉన్న చింతచెట్టు కింద పాతదైన చిన్న బంకును ఏర్పాటు చేసుకున్నాడు. అందులో కొద్ది సామగ్రి ఉంచుకుని చెట్టు నీడలో ఆటోలకు మరమ్మతులు చేస్తున్నాడు. దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తే సెంటరులో మెకానిక్ షెడ్‌ను ఏర్పాటు చేసుకుంటానని, అప్పుడు ఎక్కువగా పని దొరుకుతుందని, తద్వారా కుటుంబాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోషించుకుంటానని బాబు కోరుతున్నాడు.

- పీసీపల్లి, ఆంధ్రజ్యోతి

రవాణా శాఖ విస్తృత తనిఖీలు

● 44 కేసులు నమోదు ● రూ.1.36 లక్షల జరిమానా

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహనదారులపై 44 కేసులు నమోదు చేసి రూ.1.36 లక్షలు జరిమానా విధించినట్లు ఉప కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. సోమవారం నగరంలో అనేక ప్రాంతాల్లో బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేశారు. మొత్తం 263 వాహనాలను తనిఖీ చేశారు. రహదారి నిబంధనలను ఉల్లంఘించి హెల్మెట్ లేకుండా, అతివేగంగా వాహనచోదన, సరైన పత్రాలు లేకుండా వాహనచోదన చేస్తున్న వారిపై 44 కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులు కిరణ్ ప్రభాకర్, రామచంద్రరావు, ఎల్.సురేంద్ర ప్రసాద్, సహాయ మోటార్‌వాహన తనిఖీ అధికారులు ధర్మేంద్ర, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

కొండపి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో మైనర్ బాలికను లైంగికంగా వేధించిన సాదు కోటయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం కందుకూరులోని 1వ తరగతి అడిషనల్ జ్యుడిషియల్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి 11 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏసీబీ అధికారులమని ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు బెదిరింపు

రూ.1.50 లక్షలు నొక్కేసిన సైబర్ నేరగాళ్లు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాను ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతున్నా అంటూ ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి బెదిరించి రూ.1.50 లక్షలు గుంజుకున్నారు సైబర్ నేరగాళ్లు. ఈ ఉదంతం ఎక్సైజ్ శాఖలో కలకలం పుట్టించింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం ఒంగోలులో జరిగింది. సోమవారం ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. తొలుత తాను ఏసీబీ డీఎస్పీని అంటూ ఒంగోలు రిమ్స్ అవుట్ పోస్టులో పనిచేస్తున్న ఏఎస్సై ఏడుకొండలుకు ఫోన్ చేశారు. మీకు తెలిసిన ఎక్సైజ్ సిబ్బంది ఫోన్ నంబరు కావాలని అడిగారు. అనంతరం ఏఎస్సై తనకు ఫోన్ చేసింది ఏసీబీ అధికారులు అని నమ్మి తనకు తెలిసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ నంబరు కాన్ఫరెన్స్‌లో కలిపారు. అంతేకాదు ఎక్సైజ్ కానిస్టేబుల్ వివరాలన్నీ ఏడుకొండల నుంచి సైబర్ నేరగాళ్లు తెలుసుకున్నారు. అనంతరం ఏడుకొండలు ఫోన్ కట్‌చేసి నేరుగా ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో మాట్లాడారు. 'నీ అవినీతి భాగోతం అంతా మాకు తెలుసు, నీ మీద ఏసీబీకి ఫిర్యాదు అదింది' అంటూ బెదిరించారు. ఆ సమయంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఇంట్లోనే ఉన్నాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను కూడా బెదిరించారు. కేసు నమోదు చేస్తామని భయపెట్టారు. చివరకు కేసు లేకుండా చూస్తామని చెప్పి రూ.1.50లక్షలు నగదు ఫోన్‌పే ద్వారా వివిధ నంబర్లకు జమ చేయించుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కితే కేసు నమోదు చేస్తామని సైబర్ నేరగాళ్లు హెచ్చరించారు. ఇలా ముగ్గురు బెదిరించారు. దీంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎవరికీ చెప్పకుండా ఒక రోజు అంతా భయాందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం తేరుకొని మోసపోయాను అని తెలుసుకొని ఉన్నతాధికార్లకు తెలియజేసి, ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

యువత ఉన్నత శిఖరాలకు చేరాలి

● ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వచ్చిన చిన్న ఆవకాశాన్ని వినియోగించుకొని యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. పోలీసు శాఖ తరుపున జరిగిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు వచ్చిన 32 మందికి సోమవారం ఎస్పీ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ యువత వృత్తి నైపుణ్యం పెంచుకొని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ నేపథ్యంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన పీవీఎస్‌ఆర్ ప్రైవేట్ గ్రూపు వారి సౌజన్యంతో యర్రగొండపాలెంలో గతనెల 16న జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవీఎస్‌ఆర్ ప్రైవేట్ గ్రూపు సీఈవో పి.గోపిచంద్, పోలీసు సిబంది పాల్గొన్నారు.

11న మహిళా కళాశాలలో జాబ్‌మేళా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని జవహర్ నాలెడ్జి సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీల సంయుక్త ఆధ్వర్యంలో ఈమేళా జరుగుతుందన్నారు. వివిధ ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఒంగోలులోని ఆర్ఆర్‌సీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ముగిసిన ఓపెన్ ఇంటర్ మూల్యాంకనం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎం జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ముగిసింది. తెలుగు, ఇంగ్లీషు, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్ హిస్టరీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు సంబంధించి మొత్తం 15,200 జవాబు పత్రాలు వివిధ జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చాయి. ఈనెల 3న ప్రారంభమైన ఈ మూల్యాంకనం ముగిసింది. క్యాంప్ ఆఫీసర్‌గా ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు, ఉప క్యాంపు అధికారిగా డి.వెంకారెడ్డి వ్యవహరించారు.

ఇద్దరు న్యాయాధికారుల బదిలీ

● వారిస్థానంలో కొత్తవారు నియామకం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయస్థానంలో పనిచేస్తున్న ఇరువురు న్యాయాధికారులు బదిలీ అయ్యారు. ఆమేరకు సోమవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి అదనపు న్యాయాధికారిగా ఇక్కడ పనిచేస్తున్న డి.అమ్మనరాజాను నంద్యాలకు బదిలీ చేశారు. ఆ స్థానంలో అనంతపురంలో పోక్సో కోర్టు న్యాయాధికారిగా పనిచేస్తున్న టి.రాజ్యలక్ష్మిని నియమించారు. మూడో అదనపు న్యాయాధికారిగా ఇక్కడ పనిచేస్తున్న డి.రాములును గుంటూరు ఇండస్ట్రియల్ ట్రైబల్ కం ప్రిసైడింగ్ ఆఫీసర్, లేబర్ కోర్టుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మచిలీపట్నం జిల్లా కోర్టులో 4వ అదనపు న్యాయాధికారిగా పనిచేస్తున్న ఎ.పూర్ణిమను నియమించారు.



ఇది కదా.. దాంపత్య బంధం!

చీరాలకు చెందిన సాయికృష్ణ, విజయ దంపతులు. వీరి కుమారుడు భవన్. భర్త పట్టణంలో బేల్దారి పని చేస్తుండగా భార్య దివ్యాంగురాలు. ఆమె ఇళ్లలో పని చేస్తుంటుంది. సోమవారం మధ్యాహ్నం త్వరగా ఇద్దరి పనులు ముగియడంతో ఇంటికి చేరేందుకు కుమారుడితో పేరాల నుంచి చీరాలకు బయలు దేరారు. ఆ సమయంలో ఎండ మండుతుండడంతో నడవలేని భార్య విజయ బాధను చూడలేని భర్త ఒంటి చేత్తో ఆమెను మోసుకెళ్లడం చూసి భార్యాభర్తల బంధం అంటే ఇదే కదా అని ముచ్చటించుకున్నారు.

- చీరాల, ఆంధ్రజ్యోతి

అవి.. ఇవి

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

కంభం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంభం సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కంభం పంచాయతీ పరిధిలోని అర్బన్‌కాలనీలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఐ కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సైబర్ నేరాలు, దొంగతనాలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెట్టడంతోపాటు దొంగతనాలు అరికట్టేందుకు ఎవరిప్రాంతంలో వారు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యురాలు శివకుమారి మృతి


శివకుమారి (ఫైల్)

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ బాలినేని శివ కుమారి(73) సోమవారం హైదరాబాదులో గుండెపోటుతో మృతి చెందారు. 1981 నుంచి మార్కాపురంలో ఈమె వైద్యసేవలు అందించారు. మార్కాపురం పరిసర ప్రాంతాలలో వైద్యురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం మార్కాపురంలో చైత్ర నర్సింగ్ హోమ్ స్థాపించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈమె భర్త డాక్టర్ పిచ్చిరెడ్డి కూడా వైద్యాధికారిగా పనిచేశారు. మార్కాపురం చుట్టుప్రక్కల ప్రాంతాలలో డాక్టర్ శివకుమారికి వైద్య సేవలు అందించడంలో మంచి గుర్తింపు ఉంది. మార్కాపురంలోని కమలాహోమ్స్‌లో ఆమె భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. పలువురు పుర ప్రముఖులు రాజకీయ నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఐఎంఏ నాయకులు డాక్టర్ శివకుమారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె భర్త పిచ్చిరెడ్డి తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన సుబ్బారావు, వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి). వ మండలంలోని చింతగుంట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దారవీడు మండలం పెద్దారవీడు గ్రామానికి చెందిన సుబ్బారావు, వెంకటేశ్వర్లు చింతగుంట్ల గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మతల్లి కొలుపులకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలో ద్విచక్రవాహనంపై స్థానికంగా తిరిగే క్రమంలో జాతీయ రహదారిపై వీరి ఇరువురి బైకులు ఢీ కొన్నాయి. దీంతో ప్రమాదం చోటుచేసుకొంది. ఇద్దరికీ కాళ్లకు చేతులకు స్వల్ప గాయలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రమాదంలో గాయపడ్డ వారిని గమనించి తన వాహనాన్ని ఆపి వారిని పరామర్శించారు. తన కారులో మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు సమాచారాన్ని సేకరించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న పైరుకు తీవ్ర నష్టం


పైరును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజి నాయక్

బేస్తవారపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలో వీచిన గాలులకు 446 ఎకరాల్లో మొక్కజొన్న పైరుకు తీవ్రనష్టం వాటిల్లింద ని గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీనాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బసినేపల్లె, ఎంపీ.చెరువు, పీవీ.పురం, పూసలపాడు, మోక్ష గుండం గ్రామాల్లో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పైరును పరిశీలించారు. మండలంలోని పంటనష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయాధికారి షేక్.బాష, ఏవో జక్కం మెర్సీ రైతుసేవ కేంద్రం సిబ్బంది వై.వెంకటలక్ష్మీ, ఎన్.రామేశ్వరీ, ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య అవసరం

కొమరోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యతోపాటు ఆత్మ రక్షణ విద్యపై కూడా ప్రత్యేక శిక్షణ అవసరమని ఎస్సై నాగరాజు అన్నారు. స్థానిక నరేష్‌రెడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనను తాను రక్షించుకునేందుకు అవసరమైన శిక్షణను ప్రతి పాఠశాలల్లో ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యం చేరుకోవడానికి పాటుపడాలన్నారు. చక్కగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, సందీప్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాచర్లలోని మోడల్ హైస్కూల్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు మే 22వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు ఫీజు చెల్లించాలని, 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 9542878916 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు ప్రజావేదిక

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2003-24 సంవత్సరంలో జరిగిన పనులపై మంగళ వారం ఉదయం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఏపీవో శైలజ సోమవారం తెలిపారు. ఇప్పటికే అందుకు సంబంధించి గ్రామసభలు పూర్తి అయినట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సెల్ దుకాణదారుడు బి.రాజేష్‌ను మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు కులం పేరుతో దూషించి దాడి చేసి గాయపరిచారు. దీనితో ఈ నెల 5న బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, సీఐ సిహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి చౌడయ్యతో కలసి గ్రామంలో విచారణ చేపట్టారు. వారితో పాటు వీఆర్‌వో ఖాదర్‌వలి, వీఆర్‌ఏ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా?

- పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలు
- చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు


గురిజేపల్లి వద్ద పడేపోయే పరిస్థితిలో ఉన్న స్తంభం

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో సాగు చేసుకుంటు, నీటీ తడులు పెట్టుకుంటూ వారి పనిలో నిమగ్నమై ఉంటారు రైతాంగం. అలాంటి రైతులు ఏప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తుందో తెలియక బిక్కుబిక్కు మంటూ బ్రతకాల్సిన పరిస్థితి విద్యుత్ శాఖ అధికారులు తీసుకోస్తున్నారు. ఎర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లి, అమానిగుడిపాడు, బోయలపల్లి, చెర్లోతాండా తదితర గ్రామాలలో చాలా చోట్ల విద్యుత్ స్థంభాలు వరిగి (కింద పడిపోయేందుకు) ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి అమానిగుడిపాడు, వాదంపల్లి, గురిజేపల్లి తదితర గ్రామాలలో విద్యుత్ స్థంభాలు కిందపడిపోయాయి.


తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను గుర్తించి వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పట్టిపట్టనట్లు ఉంటున్నారు. దీనితో ఆ ప్రమాదం జరిగితేనే మేము వస్తాం స్పందిస్తాము అన్నట్లు అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చాలా ఉన్నాయి. అందుకు ఉదాహరణే ఇటీవల వర్షానికి పడిపోయిన స్థంభాలు. దీనితో రోజుల తరపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం. నేటికి ఎర్రగొండపాలెం, మిల్లంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో అంతరాయం ఏర్పడతునే ఉంది. అసలే వేసవి కాలం కావడంతో విద్యుత్ సరఫరా అంతరాయం కలగడంతో అధికారులపై మండల ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే ముందుగా గుర్తించి ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తే ఈ సమస్య ఉండదు కదా అంటున్నారు ప్రజలు.

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు..

పట్టణ, గ్రామీణ ప్రాంతం అనే తేడా లేకుండా విద్యుత్ తీగలు చేతికి అందే ఏత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా పంట పొలాల్లో, నీవాస ప్రాంతాలలో చాల చోట్ల ఇలాగే ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని రైతులు, మండల ప్రజలు చెబుతున్నారు. దానికి తోడు విద్యుత్ తీగలు పాతకాలం నాటివి కావడంతో గాలులకు మంటలు వ్యాప్తి చెందుతున్నాయని అంటున్నారు. వేసవి కాలం కావడంతో ఏదైన ప్రమాదం జరగకముందే స్పందించి ప్రమాదకరంగా కిందకు ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాలపై విద్యుత్ శాఖ ఏఈ అల్లురయ్యను వివరణ కోరగా పరిశీలించి మార్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

ముగిసిన వసంత నవరాత్రులు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

త్రిపురాంతకం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో నిర్వహిస్తున్న ఉగాది వసంత నవరాత్రులు సోమవారం ముగిశాయి. గత నెల 30వ తేదీ నుంచి నవరాత్రులు నిర్వహిస్తుండగా సోమవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, మండపారాదన, గోపూజ, సప్తశతి పారాయణం, కలశ పూజ, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నాగఫణి శాస్త్రి, ఫణీంద్రకుమార్‌శర్మ, ఆలయాల ప్రధాన అర్చకులు ప్రసాదశర్మ, విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో బలిహరణ పూజలు, వసంతోత్సవం, సంప్రోక్షణ అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాత్రిపుర సుందరీదేవి సేవాసమితి మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఈవో డి.రజనీకుమారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


పల్లకి మోస్తున్న భక్తులు

కొనకనమిట్ల : మండలంలోని చినమనగుండం, గొట్లగట్టు గ్రామాలలో రెండవరోజు సోమవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుండి భక్తులు దేవాలయానికి వెళ్లి సీతాసమేత పట్టాభిరామస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రికి సీతాసమేతరామస్వామిని వేదపండితులు ప్రత్యేకంగా అలంకరిచారు. పల్లకిలో అశీనులైన పట్టాభిరామస్వామి కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ గ్రామంలోని వీధులలో స్వామి వారిని ఊరేగించారు. అదేవిధంగా గొట్లగట్టు గ్రామంలో రెండవరోజు స్వామివారిని హనుమంత వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.

గిద్దలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబద్వేల్ రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి నవరాత్రులు వైభవంగా ముగిశాయి. చివరిరోజు సోమవారం దేవస్థానంలో ముగింపు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సీతారామస్వామి వారి గ్రామోత్సవం కనుల పండువగా మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనల నడుమ గ్రామోత్సవాన్ని దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పలుచోట్ల రాష్ట్ర స్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలను సోమవారం ప్రారంభించారు. అర్ధవీడు మండలం నాగులవరం గ్రామం లో శ్రీసీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. అలాగే కంభం మండలం లింగోజీపల్లి గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజల అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో రెండు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

రాచర్ల (గిద్దలూరు): రాచర్ల మండలం గౌతవరం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు బి.నరసింహారావు అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షులు కె.యోగానంద్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

గిద్దలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మేమున్నాము సేవా సమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి 49వ పర్యాయం రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రాణాపాయ స్థితిలో ఉండి చికిత్స పొందుతోంది. ఆమెకు అవసరమైన రక్తాన్ని అశోక్‌రెడ్డి అక్కడకు వెళ్లి రక్తదానం చేశారు. 49వ పర్యాయం రక్తదానం చేసిన అశోక్‌రెడ్డిని పలువురు అభినందించారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

రాచర్ల (గిద్దలూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాచర్లలో యాదవ సంఘం యూత్ కమిటీ సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొంది. అధ్యక్షులుగా గోమసాని రంగస్వామి, గౌరవాధ్యక్షులుగా రామకృష్ణయాదవ్, నాగశేఖర్‌యాదవ్, కె.నారాయణయాదవ్, ప్రధానకార్యదర్శిగా గడ్డం రాజేష్‌యాదవ్, కార్యదర్శులుగా జి.పవన్‌కుమార్‌యాదవ్, రాజశేఖర్‌యాదవ్, పిచ్చయ్యయాదవ్, కోశాధికారిగా రాజశేఖర్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యాదవ యూత్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఒ.వెంకటయ్య తెలిపారు.

మండల అభివృద్ధికి అందరూ సహకరించాలి

ఎంపీపీ బండి లక్ష్మీదేవి


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సహకరించాలని ఎంపీపీ బండి లక్ష్మీదేవి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ఎంపీపీ బండి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని డీఎల్‌పీవో భాగ్యవతి, ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు వివరించారు. ప్రస్తుతం రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించలేదన్నారు. ఇచ్చిన వెంటనే ఆసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కందిపప్పు సరఫరా రేషన్ కార్డుదారులు అందించడం లేదని తెలిపారు. ఎంఈవో రాందాస్ నాయక్ విద్యాశాఖ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలను, విద్యాశాఖలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్రరెడ్డి ఆ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరిస్తుండగా గజ్జల కొండ ఎంపీటీసీ సభ్యులు1,2 ఇద్దరు మాలపాటి శ్రీనివాస రెడ్డి, రమేష్ ఆ గ్రామలలో ఉన్న విద్యుత్ సమస్యలను తెలియజేశారు. గజ్జలకొండ ఎస్సీ కాలనీలో విద్యుత్‌స్తంభాల మధ్య విద్యుత్ తీగలు వేళాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని కొన్ని నెలల క్రితం ఈ సమస్యను ఏఈ దృష్టికి తీసుకొచ్చినా పరిష్కరించలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను పరిస్కారం చేయక పోవడంతో మోటార్‌లు కాలిపోతున్నాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ వేసవికాలం వచ్చిందని గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి నీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామలలో విద్యుత్ సమస్యలను, తాగు నీటి సమస్యలను గుర్తించి ప్రజల ఇబ్బందులు పడకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉద్యానవన శాఖ అధికారి రమేష్, గజ్జలకొండ పిహెచ్‌సి వైద్యులు కిషోర్, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులు వారి శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ మహిళా ప్రధాన కార్యదర్శిగా శ్వేత


నియామక పత్రం అందుకుంటున్న శ్వేత

గిద్దలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన స్ప్రింగ్‌బోర్డు పాఠశాల ప్రిన్సిపాల్ జాడి శ్వేత రాష్ట్ర బీసీ సంఘం మహిళ విభాగంలో ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆ మేరకు నియామకపత్రాన్ని గుంటూరులో జరిగిన బీసీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో శ్వేత అందుకున్నారు. బీసీ మహిళల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాల గురించి బీసీ మహిళల్లో ప్రచారం నిర్వహించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌లో ప్రథమ స్థానం


ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న మానవతా సేవా సంస్థ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జిల్లాలోనే ఎన్‌రోల్‌మెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ రేణుక, సిబ్బదిని సోమవారం సన్మానించారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రత్యేకించి ప్రకాశం జిల్లాలో ఉన్న అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల కంటే అత్యధికంగా పదోతరగతి పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థులందరిలో జిల్లాలోనే మార్కాపురం బాలికల పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కె.శ్రీనివాసరెడ్డి, మానవతా స్వచ్ఛందసేవా సంస్థ నాయకుడు గుంటక చెన్నారెడ్డి, వనజాక్షి, రాష్ట్రీయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించేందుకు పట్టణవాసుల ఉత్సాహం


పన్ను చెల్లించేందుకు బారులు తీరిన ప్రజలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం 5శాతం రాయితీ ఇవ్వడంతో సోమవారం గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలు బారులు తీరారు. రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయగా పట్టణవాసులు ఎక్కువ శాతం పన్ను చెల్లించారు. 5శాతం తగ్గింపు అవకాశం ఈనెల చివరి వరకు ఉండడంతో వారు పన్ను చెల్లించేందుకు ఉత్సాహం చూపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఐ.శ్రీనివాసులు కోరారు.

నరసింహారావుకు సన్మానం


సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 1975 ఎమర్జెన్సీ సమయంలో ఎంఐఎస్‌ఏ కేసుపై అరెస్టు అయిన మార్కాపురానికి చెందిన టి.నరసింహారావును బీజేపీ నాయకులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు మాట్లాడుతూ.. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఒంటెత్తు పోకడల కారణంగా ఎమర్జెన్సీ విధించిన సమయంలో ఎందరో జెన్సన్ కార్యకర్తలను జైల్లో పెట్టారన్నారు. వారిలో ఒకరైనా నరసింహారావు త్యాగాలు మర్చిపోలేనివన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాదర్తి ఆంజనేయులు, రామకృష్ణ, కాశీం, సతీష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం : ఎమ్మెల్యే


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యాసిడ్ దాడిలో వ్యక్తి మృతిచెందగా, ఆ కుటుంబ సభ్యులు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని సోమవారం ఆయన నివాసంలో కలిశారు. మృతికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న రాజంపేటలో వర్రా నాగార్జునపై భార్య ప్రసన్న యాసిడ్ పోసి అతికిరాతకంగా చంపేందుకు యత్నించింది. ఆయన తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను కలిశారు. భార్య ప్రసన్నతోపాటు ఆమెకు సహకరించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రాజంపేట సీఐ కులాయప్పతో ఫోన్‌లో మాట్లాడి కేసు పరిస్థితిని తెలుసుకున్నారు. నిందితులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. మృతునికి ఖర్చుపెట్టిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధికింద సాధ్యమైనంత మేరకు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి, నాయకులు ముత్తుముల యల్లారెడ్డి, ఎం.ఆంజనేయులు, వర్రా రమణ, నాగిశెట్టి, ఇర్రి గోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఏఎంసీ చైర్మన్

గిద్దలూరు టౌన్ : ఇటీవల ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సిఫారసు మేరకు కంభం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా నియమితులైన బేస్తవారపేటకు చెందిన పూనూరు భూపాల్‌రెడ్డి, మండలానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని వారు పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. రైతుల సంక్షేమం, రైతుల అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే సూచించారు.

రాళ్లవాగు ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు


అర్జీ అందజేస్తున్న లక్ష్మినారాయణ

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) ఎర్రగొండపాలెం గ్రామంలో రాళ్లవాగు సరిహద్దు భూములను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని గుర్రం లక్ష్మినారాయణ, తూమాటి సాలమ్మలు పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఒంగోలులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎర్రగొండపాలెం సర్వేనంబరు 28లో ఉన్న రాళ్లవాగు సరిహద్దులోని రెండెకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ఇళ్లు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ అన్సారియా, మార్కాపురం సబ్ కలెక్టరును చర్యలు తీసుకోవాలని, ఆక్రమణ ప్రదేశంలో నిషేదం బోర్డు ఏర్పాటు చేయించాలని సూచించినట్లు అర్జీదారులు పేర్కొన్నారు.

నేడు దొనకొండలో ప్రజాదర్బార్

దొనకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సచివాలయం-1 కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈకార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను డాక్టర్ లక్ష్మి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశారు. ఈక్రమంలో సోమవారం గ్రామంలో ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడటం వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు, పి.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'ఎత్తిపోతల' మరమ్మతులకు నిధులు కేటాయించాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకానికి ఎస్‌ఎస్‌పీ ద్వారా నిధులు కేటాయించాలని కోరుతూ ఎస్‌ఈ వరలక్ష్మికి మోదేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు సోమవారం వినతి పత్రం అందజేశారు. రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తే ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేసి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఉన్నం పరిపూర్ణయ్య, చాగంటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు

కురిచేడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదనంపాడు గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణకు రూ.5.30 లక్షల వేలం పాట నిర్వహించారనే విషయం కలకలం రేపింది. ఈవిషయమై దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు సోమవారం గ్రామంలో విచారించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ, ఈఈఆర్వోతో కలసి సీఐ గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో అక్రమంగా మద్యం ఉంచి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

పామూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సురేష్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీచేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల ఒకటో తేదినుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.రమణయ్య, జబీన్ హసన్, నాగభూషణం, రాధిక, రవి కాంత్, బ్రహ్మారెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలి

పామూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించు కోవాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ బాబు అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బాబు సోమవారం పామూరుకు విచ్చేశారు. ఈసందర్భంగా విరాట్‌నగర్‌లోని దేవస్థానంలో మండల విశ్వబ్రా హ్మణ సంఘం అధ్యక్షుడు నొస్సం నాగేంద్రచారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రావూరి లక్ష్మయ్య, కొండూరు విశ్వసేన్, కీనల శ్రీనివాసులుచారి, వినుకొండా రామాచారి, పెరమన విజయ్‌కుమార్‌చారి పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

పామూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైద్య అవసరాల కోసం ఇబ్బంది పడుతున్న బాధితులకు మానవతా సంస్థ ఆర్థికసాయం అందజేసింది. మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న గంధం రాజారత్నం, రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి మంచానికే పరిమితమైన చవిడిశెట్టి వెంకటేశ్వర్లుకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య, పి. తిరుపతిరెడ్డి, టి.రమేష్, బి.రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 8వేలు

సీఎస్‌పురం (పామూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.1,07,953 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.38,730, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 22,830, అన్నదాన విరాళాల ద్వారా రూ.35,876, పంచామృత అభిషేకం విరాళాల ద్వారా రూ. 5,516, ఇతర విరాళాల ద్వారా రూ.5,001 వచ్చినట్లు ఈవో తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా కేజీబీవీలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ)లలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందేలా కేజీబీవీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో రూ.కోటి 49 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత పాఠశాలలోని ఉపాధ్యాయులపై ఉందన్నారు.

కేజీబీవీలో మౌలిక వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యుత్ సమస్య ఉందని సిబ్బంది తెలిపారు. వెంటనే విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే పిలిపించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు సకాలంలో భోజనం పెట్టకపోయినా, మెనూ పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి, ముక్కు పెద్దిరెడ్డి, గవదకట్ల హరి, గొనా ప్రతాప్, బీరం వెంటేశ్వర రెడ్డి, చిలకల వెంటేశ్వర రెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి రామిరెడ్డి, కొంగోలు శ్రీను, మీనిగ కాశయ్య, కేసరి రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి భళా!

» ఎకరానికి 50 నుంచి 60 బస్తాలు
» వరి సాగు రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం
» దశాబ్దకాలంలో ఇదే అధికం


ధాన్యాన్ని కాటా వేస్తున్న కూలీలు

ముండ్లమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరం, మోదేపల్లి మేజర్ల కింద రబీ సీజన్‌లో రెండో పంటగా వరి పైరు(1010రకం) సాగు చేసిన రైతుల పంట పండింది. దిగుబడి గణనీయంగా వచ్చింది. దశాబ్దకాలంలో ఇంత దిగుబడి చూడలేదని రైతులు పేర్కొన్నారు. ప్రతిఏడాది వరి సాగు చేసిన రైతులకు ఎకరానికి 25 నుంచి 30 బస్తాలలోపే వచ్చేవి. దీంతో పెట్టుబడి కూడా రాక వరి సాగు రైతులు నష్టాల బాట పట్టారు. ఈ ఏడాది రబీలో రెండో పంటగా 1010 సాగు చేసిన రైతులకు కలసి వచ్చింది. ఎకరానికి 50 నుంచి 60 బస్తాల వరకు దిగుబడి వచ్చింది.

ముండ్లమూరు మండలంలో 1500 ఎకరాల్లో 1010 రకం సాగు చేశారు. గత పది రోజుల నుంచి నూర్పిళ్లచేసి అమ్మకాలు చేస్తున్నారు. ఎకరానికి దిగుబడి 60 బస్తాల వరకు వస్తుంది. పెట్టుబడి రూ.30 వేల నుంచి రూ.35 వేలు వరకు అవుతుంది. దీంతో పెట్టుబడి, కోత, నూర్పిడిలు, ఇతర ఖర్చులు పోను రూ.15వేలు నుంచి రూ.20 వేల వరకు మిగులుతున్నాయి. గత ఐదు సంవత్సరాల నుంచి వరి సాగు చేసి నష్టపోయిన రైతులకు ఈ ఏడాది కలిసివచ్చింది. రజానగరం, మోదేపల్లి మేజర్ల పరిధిలోని గ్రామాలైన కెల్లంపల్లి, బసవాపురం, చినఉల్లగల్లు, పెదఉల్లగల్లు, కమ్మవారిపాలెం, రజగోపాలరెడ్డి నగర్, లక్ష్మీనగర్, మోదేపల్లి మేజరు పరిధిలో ఈదర, కొమ్మవరం, అయోధ్య నగర్, వేములబండ, భీమవరం, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామలకు చెందిన రైతులు రబీలో 1010 రకం వరి సాగు చేశారు.



నాలుగు ఎకరాల్లో సాగు చేశా

- గరికపాటి శ్రీనివాసరావు, కెల్లంపల్లి

నాలుగు ఎకరాల్లో 1010 రకం వరి సాగు చేశాను. ప్రస్తుతం దిగుబడి వచ్చి అమ్మకాలు చేయగా ఎకరానికి 60 చొప్పున 240 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి పోను ఎకరానికి రూ.15వేలు చొప్పున మిగిలింది. గత పది సంవత్సరాలుగా ఎప్పుడూ కూడా ఇలాంటి దిగుబడి రాలేదు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లి పంచాయతీలో మునీనది తీరాన సోమవారం ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈసందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకం, లక్షతమలార్చన తదితర పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి స్వామికారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, ట్రాక్టర్లను స్వామివారికి ప్రదర్శనలు చేయించారు. ప్రసన్నాంజనేయస్వామి గుడి చుట్టూ మూడు ప్రదర్శనలు చేస్తే ఎలాంటి వ్యాధులు సోకవని భక్తుల నమ్మకం.

తిరునాళ్ల సందర్భంగా రాజంపల్లి, కుంచేపల్లిలో టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు, కుంచేపల్లిలో వైసీపీ ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్లకు దర్శి, పొదిలి మండలాల్లోని రాజంపల్లి, జముకులదిన్నె, రామచంద్రాపురం, కొత్తపల్లి, లక్ష్మీనారాయణపురం, కుంచేపల్లి, ఉన్నగురవాయిపాలెం, ఈగలపాడు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.


ప్రసన్నాంజనేయస్వామికి ఆకుపూజ చేస్తున్న పూజారులు

చిత్రలేఖనంలో గురుకుల విద్యార్థులకు అవార్డులు


చిత్రలేఖనంలో జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న ప్రసాదరావు

కురిచేడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో విజయవాడలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో కురిచేడులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు 9 బంగారు, 13 రజత పతకాలు సాధించారు. ఆర్ట్ టీచర్ ప్రసాదరావుకు జాతీయ స్థాయి అవార్డు, ఉత్తమ పాఠశాల అవార్డు లభించింది. ఈనెల 5న విజయవాడలోని డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ జాతీయ స్థాయి చిత్ర లేఖనం పోటీలు నిర్వహించింది. వివిధ రాష్ట్రాల నుంచి వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో కురిచేడు గురుకుల పాఠశాల విద్యార్థులు మనోజ్ కుమార్, మనోజ్‌పాల్‌తో పాటు మరో ఏడుగురు బంగారు పతకాలు పొందారు. 13 మంది రజత పతకాలు సాధించారు. ఇంతమంది అవార్డులు సాధించడంతో ఉత్తమ ఆర్ట్ పాఠశాలగా అవార్డు అందజేశారు. అటవీ శాఖ తరఫున వికసిత్ భారత్ మోదీ కార్యక్రమంలో భాగంగా మన ప్రకృతిని మనమే కాపాడుకుందాం అనే అంశంమీద అప్పటికపుడు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

అవార్డులు సాధించిన విద్యార్థులను, ఆర్ట్ టీచర్ ప్రసాదరావును గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోన్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ భూముల పంపిణీకి చర్యలు

» ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న

తాళ్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్యనగర్ ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించి నిబంధనల మేరకు పట్టాలు పంపిణీకి చర్యలు చేపడతామని ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్టీలకు భూములు పంపిణీ చేయలేదంటూ హైకోర్టును ఆశ్రయించి కోర్టుధిక్కరణ కేసు వేసిన రాష్ట్ర ట్రైబల్ రైట్స్ ఫోరమ్ చైర్మన్ ఇట్టా బాబురావుతో సోమవారం ఆమె మాట్లాడారు. సోమవర్పాడు సర్వే నంబర్ 370 నుండి 405 వరకు గల ప్రభుత్వ భూముల్లో దశాబ్దాల కాలంగా ఎస్టీలు సాగుచేసుకుంటున్నారని బాబురావు పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు పంపిణీ చేయాలని అనేకమార్లు అధికారులకు, ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. గత్యంతరం లేక హైకోర్టును ఆశ్రయించగా ఎస్టీలకు న్యాయం చేయమని ఆదేశించినా పట్టించుకోలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయనందునే అధికారులు, ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి, అర్హత గల ఎస్టీలందరికి పంపిణీకి చర్యలు చేపడతామన్నారు.


మాట్లాడుతున్న ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న

అనంతరం ఆర్‌డీవో ఏకలవ్యనగర్‌ను సందర్శించి ఎస్టీలతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.సంజీవరావు, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియోల్ రాజు, సర్వేయర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
» రూ.1.39 కోట్లతో గార్లపేట-కందుకూరు రోడ్డు నిర్మాణానికి మోక్షం


సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని గార్లపేట నుంచి శంఖవరం మీదుగా కందుకూరు ప్రధాన రోడ్డులోకి కలిసే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా శంఖవరం ప్రజలు ఛిద్రమైన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారీ గ్రానైట్ వాహనాలతో రోడ్డు దారుణంగా మారడంతో పలుమార్లు ఆందోళనలు చేపట్టిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. అప్పటి పాలకులు నిర్లక్ష్యం వహించటంతో ప్రజలు నానా ఇబ్బందులుపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా శంఖవరం గ్రామానికి వచ్చిన సందర్భంలో రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్డు నిర్మాణానికి నిధుల కోసం ఆర్‌అండ్‌బీ, మైనింగ్, మున్సిపల్ శాఖలను పరిశీలించిన సందర్భంలో నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మున్సిపాల్టీలో వచ్చే ఆదాయం నీటి సరఫరా చేసేందుకు సరిపోతున్నాయన్నారు. ఈక్రమంలో రోడ్డు ఏర్పాటులో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం మైనింగ్‌శాఖ వారితో చర్చించి రూ.ఒక కోటి 39లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ ప్రచారాలను ప్రజలు త్రిప్పికొట్టాలన్నారు. కనిగిరి ప్రాంతంలో బయోగ్యాస్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసేందుకు రిలయన్స్ సంస్థ ముందుకువచ్చిందన్నారు.

అనంతరం పట్టణ సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవనాలకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేశారు. తదఅనంతరం శ్రీభ్రమర టౌన్‌షిప్ సమీపంలో 'హంబుల్' సినిమా షూటింగ్‌ను ఎమ్మెల్యే కెమెరా స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేలు, చైర్మన్ గఫార్, టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), భేరి పుల్లారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, తెలుగు మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైల్వే డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి

దొనకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని గుంటూరు రైల్వే డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే హాస్పటల్‌లో సోమవారం రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో ఉదయం, సాయంత్రం ఎండతగ్గిన తర్వాత బయటకువచ్చి పనులు చూసుకోవాలన్నారు. అత్యవసరంగా మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాల్సి వస్తే ఓఆర్‌ఎస్, గ్లూకోజ్ వాటర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వేసవిలో పాటించాల్సిన అనేక విషయాలను ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకే గుర్తింపు

పామూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసేవారికే రాబోయే రోజుల్లో పదవులు దక్కుతాయన్నారు. గత ప్రభుత్వం మాదిరి సహజ వనరులను దోచుకోవడానికి రాజకీయాల్లోకి రావద్దని, ప్రజలకు సేవ చేయడానికి రావాలన్నారు. 60 కుటుంబాలకు ఒక సాధికార సారథిని నియమించాలన్నారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఇంకా పాత పద్ధతుల్లోనే ఉన్నారన్నారు. ప్రతి పనికి లంచాలు ఇవ్వాల్సి వస్తుందన్నారు. ప్రజాదర్బార్‌లు పెట్టి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. సాధికారుల జాబితాను రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల మాజీ జడ్పీటీసీ ఎం.హుసేన్‌రావు అకాల మరణం తనను కలిచివేసిందని, ఆయన మృతికి సమావేశంలో మౌనం పాటించారు. అనంతరం గ్రామాలవారీగా నాయకులతో పార్టీ పరిస్థితి గురించి చర్చించారు. సమావేశంలో అడుసుమల్లి ప్రభాకర్, చుంచు కొండయ్య, బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, ఆర్‌ఆర్ రఫీ, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఎన్.సాంబయ్య, ఇర్రి కోటిరెడ్డి, ముబినా మౌలాలి, పువ్వాడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

తాళ్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చికిత్సపొందుతూ వృద్ధుడు సోమవారం మృతిచెందాడు. తాళ్లూరులోని ముండ్లమూరు వెళ్లేమార్గంలో కోట వెంకటసుబ్బారెడ్డి(72) నివాసం ఉంటున్నాడు. నిత్యం ఇంటి బయట నిద్రిస్తుండేవాడు. గత నెల 22వ తేదీరాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా, ఆమార్గంలో వెళుతున్న పెద్ద వాహనానికి విద్యుత్ తీగ తగిలి బలంగా ముందుకు వెళ్లటంతో డాబా గోడ విరిగి నిద్రిస్తున్న వ్యక్తిపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందాడు. గత రెండు రోజులుగా ఆరోగ్యపరిస్థితి విషమించటంతో ఒంగోలు రిమ్స్‌లో చేర్పించారు. చికిత్సపొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదుచేశారు. సుబ్బారెడ్డి కుమారుడు రామిరెడ్డి తాళ్లూరులో టీడీపీ క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నాడు.

హామీలను అమలుపరచడంలో ప్రభుత్వం వైఫల్యం

సీఎస్‌పురం (పామూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపర్చడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ఆరోపించారు. సీఎస్‌పురంలో సోమవారం వైసీపీ మండల అధ్యక్షుడిగా పాలగొళ్ల మల్లికార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరిని కలుపుకొని నూతన అధ్యక్షుడు కృషి చేయాలని సూచించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బి.వెంకటయ్య, ముత్యాల నారాయణరెడ్డి, కె.రామిరెడ్డి, షేక్ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. కాగా, మల్లికార్జునరెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు గైర్హాజరయ్యారు. ఎంపీపీతోపాటు అతని అనుచరవర్గం కూడ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.

ముండ్లమూరు ఎస్‌ఐగా కమలాకర్

ముండ్లమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు ఎస్‌ఐగా కె.కమలాకర్‌ను నియమిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు వీఆర్‌లో కమలాకర్ పని చేస్తూ అటాచ్‌మెంట్‌పై ముండ్లమూరుకు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వై.నాగరాజు బాపట్ల జిల్లా బల్లికురవకు బదిలీ అయ్యారు.

భూ సమస్యలపై వినతులు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో భూ సమస్యల పరిష్కారం కోసం వినతులు వెల్లువెత్తుతున్నాయి. వివిధ సమస్యలను పరిష్కరించాలని రైతులు, ప్రజలు అర్జీలు ఇస్తున్నా పరిష్కారంలో అధికారులు చొరవ నామమాత్రంగా మారింది. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పది మంది, తహసీల్దార్ కార్యాలయంలో ఆరుగురు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఆవుల వెంకటరెడ్డి అనే వృద్ధుడు హైద్రాబాద్‌లో ఉంటున్న తన సంతానం వద్ద నివసిస్తున్నాడు. ఏడాది తర్వాత వచ్చి చూస్తే తన భూమిని కొంతమంది అక్రమార్కులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించారు. తప్పుడు పత్రాలు సృష్టించి తన సంతకం లేకుండా కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

అలాగే, తహసీల్దార్ కార్యాలయంలో చల్లగిరగల గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తన కుమారుడు తెల్ల కాగితంపై సంతకం చేయించుకుని భూమిని కాజేసే ప్రయత్నం చేశాడని ఫిర్యాదు చేశాడు. తన భూమిని ఎవరికి అమ్మలేదని, వ్రాసి ఇవ్వలేదని పేర్కొన్నారు. సదరు భూమిని ఎవరి పేరు మీదకు మార్చవద్దంటూ తహసీల్దార్ రవిశంకర్‌ను వేడుకున్నాడు.

వేతనం కోసం ఎదురుచూపులు

ముండ్లమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి వేతనం అందలేదు. దీంతో కూలీలు ఎప్పుడు తమ వేతనాలు పడతాయో, కుటుంబ అవసరాలు తీరతాయోనని కూలీలు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు రూ.72,85,126 వేతనాలు అందాల్సి ఉంది. ప్రతి రోజు కూలీలు ఉదయం పనికి వెళ్ళి ఒక్కొక్కరు రూ.307 వేతనం పడేవిధంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా వ్యవసాయ పనులు ఉన్నా కూడా ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకే వెళ్తున్నారు. వారాల తరబడి వేతనాలు రాక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు సైతం ఉపాధి హామి పథకంపై ఆధార పడి ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మూడు నెలల వేతనాలు చెల్లించే విధంగా చూడాలని కూలీలు కోరుతున్నారు.



ప్రధాని సభకు ప్రత్యేకాధికారిగా వీరపాండ్యన్

గుంటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరగనున్న ప్రధాన మంత్రి సభకు ప్రత్యేక అధికారిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ప్రభుత్వం చేపట్టబోతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో పీఎంఓ నుంచి ఆమోదం కూడా ల భించింది. ఈ నెల 20వ తేదీ తరువాత ప్రధాని రాజధాని అమరా వతికి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక అధికారి జీ వీర పాండ్యన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.



- అటెండెన్స్ మార్కింగ్ చేయని సచివాలయాల ఉద్యోగులు
- 3 జిల్లాల ఉద్యోగులది ఇదే తీరు
- అదేమని ప్రశ్నిస్తే కుంటి సాకులు
- రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట ఆదేశాలు

హాజరు ఉంటేనే.. జీతాలు



గుంటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో ఇంకా కొంత మందిలో నిర్లక్ష్య ధోరణి పోవడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఈ వ్యవస్థలో నియమితులైన ఉద్యోగులు తాము ప్రత్యేకమన్న రీతిలో వ్యవహరించే వారు. వివిద ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల ఆదేశాలు ఖాతరు చేసే వాళ్ల కాదు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతున్నది. సచివాలయాల ఉద్యోగులంతా హ్యూమన్ రిసోర్సు మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్/యాప్‌లో లాగిన్ అయి తప్పక ఇన్ వార్డు, అవుట్‌వార్డు హాజరుని మార్కింగ్ చేయాలని పదేపదే ప్రభుత్వం ఆదేశిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఏవేవో కుంటిసాకులు చెబుతూ హాజరు వేయకుండా జీతాలు డ్రా చేస్తున్నారు. దీని వలన సర్వీసు డెలివరీ, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించడంలో ఇబ్బందులు తలెత్తు తుండటంతో ఇక నుంచి ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మూడు జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

సచివాలయాల వ్యవస్థ ఏర్పాటైన తర్వాత 2021వ సంవత్సరం ఫిబ్రవరి నాల్గో తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పక రోజుకు రెండు సార్లు వేయాలని ఆదేశించింది. ఆ తర్వాత ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఎంఎస్ యాప్‌ని ప్రతి ఒక్క ఉద్యోగికి తీసుకొచ్చింది. ఇది జియో కో-ఆర్డినేట్స్ ఆధారంగా అటెండెన్స్‌ని మార్కింగ్ చేస్తుంది. ఉద్యోగి సంబంధిత సచివాలయానికి 300 మీటర్ల లోపు ఉంటే అటెండెన్స్ మార్కింగ్ అవుతుంది. ప్రతి ఒక్క ఉద్యోగికి జాబ్ చార్ట్ ప్రకారం ఇన్‌వార్డు, అవుట్‌వార్డు టైమింగ్స్ ఉన్నాయి. అయినప్పటికి కొందరు నిర్లక్ష్య ధోరణితో ఉంటూ సమయానికి వచ్చి అటెండెన్స్‌ని మార్కింగ్ చేయకుండా లేటుగా వస్తున్నారు. కొందరైతే సాయంత్రం వచ్చి ఇన్‌వార్డు, అవుట్‌వార్డు రెండూ ఒకే సారి నిమిషాల వ్యవధిలో మార్కింగ్ చేస్తున్నారు. అదేమంటే తాము ఫీల్డ్‌లో ఉన్నామని, ఫలాన అధికారి పని చెప్పారని, పింఛన్ల పంపిణీ ఆలస్యమైందని వంటి ఏవేవో కారణాలు చెబుతున్నారు.

> గుంటూరు జిల్లాలో 568 గ్రామ/వార్డు సచివాలయాలుండగా 4806 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3696 మంది హెచ్‌ఆర్ ఎంఎస్ పోర్టల్‌లో అటెండెన్స్‌ని సక్రమంగా మార్కిం గ్ చేస్తున్నారు. 1109(23 శాతం) మంది అటెండెన్స్‌ని మార్క్ చేయడం లేదు. బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలుంటే 4,259 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో 3182 మంది హాజరు వేస్తు న్నారు. 1077 (25 శాతం) మంది పోర్టల్/యాప్‌లో హాజరు మార్క్ చేయడం లేదని తేలింది. పల్నాడు జిల్లాలో 538 సచివాలయంటే 4456 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీళ్లలో 3536 మంది మాత్రమే నిత్యం హాజరుని మార్కింగ్ చేస్తున్నారు. 920(21 శాతం) మంది హాజరుకు దూరంగా ఉంటున్నారు.

ఈ నేపథ్యంలో కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లను సక్రమంగా పర్యవేక్షించ లేని పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. ముఖ్యంగా ప్రజలకు సర్వీసు డెలివరీ సకాలంలో చేయ లేని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ కారణాలతో హెచ్‌ఆర్‌ఎం పోర్టల్‌లో అటెండెన్స్ వేస్తేనే జీతాలు విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి తరచుగా సమీక్షించాలని సూచించింది. అలానే గుంటూరు జిల్లాలో 86, బాపట్లలో 56, పల్నాడులో ఏడుగురు సచివాలయాల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై వేరే పనులకు వినియోగిస్తున్నారు. తక్షణమే వాటన్నింటిని రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏదైనా విపత్తులు సంభవించినప్పుడు మాత్ర మే అది కూడా ఏడు రోజులకు మించి డిప్యూ టేషన్ చేయొద్దని స్పష్టం చేసింది. సీఆర్‌డీఏకి చేసిన డిప్యూటేషన్లు మినహా మిగిలిన వన్నింటిని రద్దు చేయాల్సిందేనని, సిబ్బంది సచివాలయాల నుంచే విధులు నిర్వహించా లని తేల్చి చెప్పింది.

రబీ ధాన్యం.. సేకరణకు సిద్ధం!



- నేటి నుంచి తెరుచుకోనున్న కొనుగోలు కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బాపట్ల జిల్లాలో రబీకి 10,000 టన్నుల నుంచి 30,000 వరకు పెంపు
- పల్నాడు జిల్లాలో 10,000 టన్నుల సేకరణకు అనుమతి
- లేట్ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాని స్పష్టత

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రబీ ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 42 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి రబీ సీజన్‌లో 62,000 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి ఉంటుందనేది అంచనాగా ఉంది. మూడు వారాల క్రితం రబీ సీజన్‌లో 40,000 టన్నుల సేకరణకు అధికారులు ప్రతిపాదనలు పంపంగా 10,000 టన్నులకే గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కానీ తాజాగా ఇచ్చిన ఆదేశాలలో ప్రభుత్వం దానిని 30,000 వరకు పెంచింది. పల్నాడు జిల్లాకు వచ్చేసరికి రబీలో 10,000 టన్నుల సేకరణకు అనుమతులు వచ్చాయి. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ప్రభుత్వం రబీలో కూడా అదే ఒరవడి కొనసాగిస్తామని ధీమాగా చెబుతోంది. 75 కేజీల ధాన్యం బస్తా ధర గ్రేడ్-ఏ రకం మద్దతుధర రూ.1740 ఉండగా, కామన్ రకం రూ.1725గా ఉంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో మద్దతు ధరకన్నా రూ.150 నుంచి రూ.200 తక్కువగా ఉండడంతో రైతుల చూపు కొనుగోలు కేంద్రాల వైపే ఉంది. దీంతో మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాలు వేదికగా కొనుగోళ్లు జరపనుండడంతో రైతులకు మేలు చేకూరనుంది.

ఈ సారి కూడా పెంచక తప్పదా...

ఖరీఫ్ సీజన్‌లో మద్దతు ధరకు ధాన్యం సేకరణ విషయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల మూడు జిల్లాల పరిధిలో తొలుత ఇచ్చిన లక్ష్యం కంటే దశలవారీగా అనుమతులు పెంచుకుంటూ రావాల్సి వచ్చింది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌కు తొలుత ఇచ్చిన లక్ష్యం 50,000 టన్నులే కాగా అది ముగింపుకొచ్చేసరికి 92,000 టన్నుల వరకు వెళ్లింది. ఖరీఫ్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో రబీ ధాన్యం దిగుబడులు నామమాత్రంగా ఉండడంతో అక్కడ సేకరణ విషయంలో ఇంకా స్పష్టత లేదు. పల్నాడు జిల్లాలోనూ రబీకి సంబంధించి పెద్దగా సమస్యలు ఉత్పన్నం కాకపోవచ్చు కానీ బాపట్ల జిల్లాలో లేట్ ఖరీఫ్ దిగుబడులు దాదాపు 42,000 టన్నుల వరకు ఉండడంతో వాటిని మద్దతు ధరకు కొనే విషయంలో రైతాంగంలో ఆందోళన నెలకొంది.

పెంచింది లేట్ ఖరీఫ్ కోసమేనా..

రబీ సీజన్‌లో బాపట్ల జిల్లాకు తొలుత అనుమతి ఇచ్చింది పది వేల టన్నులే కాగా దానిని ఇప్పుడు 30,000 వరకు పెంచారు. లేట్ ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఈ పెంపు నిర్ణయం తీసుకుందా అనే విషయంలో స్పష్టత లేదు. లేట్ ఖరీఫ్ ధాన్యాన్ని రబీలో కొనడానికి ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధికారులు ఇప్పటికే రాష్ట్రస్థాయి కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. కానీ ఆ చిక్కులను తొలగించే విషయంలో ఇంకా ఓ నిర్ణయానికి రాలేదనేది సమాచారం.

ఏప్రిల్ చివరి వారంలో కానీ...

గత ప్రభుత్వంలో రబీ సీజన్ ధాన్యం సేకరణ విషయంలో ఏప్రిల్ చివరి వారంలో కానీ కదలిక మొదలయ్యేది కాదని, ఈ సారి ఏప్రిల్ రెండో వారంలోనే కొనుగోలు కేంద్రాలు తెరవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా తొలుత వచ్చిన అనుమతులతోనే సరిపెట్టకుండా రైతుల అభ్యర్థనల మేరకు పలు దఫాలుగా అధికారులు ప్రతిపాదనలు పంపి నేతల సహకారంతో వాటిని సాధించుకోవడం కూడా అన్నదాతలకు మేలు చేకూరుతోంది.

> **గోనె సంచులు..జీపీఎస్ వాహనాలు**
>
> రైతాంగం ప్రయోజనాలు దెబ్బ తీసే విధంగా మిల్లర్లు వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఖరీఫ్ సీజన్‌లో గట్టిహెచ్చరికలనే ప్రభుత్వం పంపించ గలిగింది. క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టడంతో చాలా వరకు మిల్లర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేయగలిగారు. ఖరీఫ్‌లో గోనె సంచుల సమస్య ఉత్పన్నమయింది. దీంతో రబీలో ముందుగానే బ్యాగులను పెద్ద ఎత్తున సంచులను సిద్ధం చేశారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసే వ్యవస్థతో పాటు అన్ని ఏర్పాట్లను యంత్రాంగం పూర్తి చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఈ విషయంలో ఎవరైనా మిల్లర్లు ఉల్లంఘనలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని ఇప్పటికే అధికారులు హెచ్చరించారు.

ఆ దర్యాప్తులు.. అంతేనా

- నోటీసులు, విచారణలంటూ హడావుడి
- నిగ్గు తేల్చిందే లేదు.... చర్యల ఊసే కరువు
- కీలకమైన కేసుల్లోనూ తాత్సారమే
- పంచాయతీ, రెవెన్యూ విభాగాల్లోనే దాదాపు 115 విచారణలు!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏ ఒక్క విభాగాన్ని వదిలిపెట్టకుండా అందినకాడికి వైసీపీ నేతాగణంతో కలిసి కొంతమంది ఉద్యోగులు దండుకున్నారు. ఇష్టారీతిన అనధికార కట్టడాలకు అనుమతులు, అసైన్డ్ భూముల్లో రిసార్టుల పర్వమయితే ఆకాశమే హద్దుగా సాగింది. మెప్మా, పంచాయతీ, డ్వామా వంటి విభాగాల్లో వెలుగుచూ సిన అక్రమార్కుల లీలలు అన్నీఇన్నీ కావు. తహసీల్దార్ల కార్యాలయాలే అడ్డాగా చేసుకుని వైసీపీ నాయకులు సాగించిన భూదందాలకు కొదవలేదు. ఇలా ఒకటేమిటి అన్ని చోట్లా ఇదేతంతు. నిబంధనలను కాలరాస్తూ తిలాపాపం తలాపిడికెడు అన్న చందాన అందరూ పంచుకున్నారు. వీటన్నింటిపై నూతన ప్రభుత్వంలో విచార ణలు ఉంటాయని ఆర్భాటపు మాటలు కాకుండా కఠినచర్య లకు దిగుతుందని బాధితులతో పాటు సామాన్య ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అలాంటిదేమి జరగకపోగా నోటీసులు, విచారణలు, దర్యాప్తులంటూ హడావిడి తప్ప తీసుకున్న చర్యలు శూన్యం. గత ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చిన అవినీతి బాగోతాలపై దర్యాప్తులు నత్తనడకన సాగుతుండడం ఒక ఎత్తయితే డ్రగ్స్ దందా వంటి కీలక కేసుల్లో దర్యాప్తు పురోగతి లేకపోవడం మరింతగా కలవరపరుస్తోంది



అక్రమాలపై విచారణ ఎదుర్కొంటున్న కుంకలమర్రు గ్రామ పంచాయతీ

> **పంచాయతీలను ఊడ్చేశారు.....రెవెన్యూది అదేదారి**
>
> ప్రభుత్వం మారగానే గత ఏలుబడిలో జరిగిన అనేక అక్రమాలపై ఒక్క పంచాయతీ, రెవెన్యూ విభాగాల్లోనే దాదా పు 115 వరకు నోటీసులు జారీ చేసి విచారణకు ఆదేశిం చినట్లు తెలుస్తోంది. పంచాయతీల్లో జరిగిన లీలయితే అన్నీ ఇన్నీ కావు. అధికార బలంలో నాలుగు పంచాయతీలకు చెం దాల్సిన నిధులు ఒకే పంచాయతీకి మళ్లించడం మొదలుకుని పర్చూరు నియోజకవర్గం కుంకలమర్రు గ్రామంలో విద్యుత్ బిల్లుల విషయంలో జరిగిన గోల్‌మాల్ వరకు దాదాపు 55 విచారణలను ఒక్క పంచాయతీ విభాగంలోనే ఆదేశించారు. ఫ్రీ హోల్డ్‌తో పాటు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ విషయంలో జిల్లాలో దాదాపు 60 వరకు మండల స్థాయిలో విచారణలు సాగుతున్నాయి.

అసైన్డ్ చెరబట్టారు...దర్జాగా వ్యాపారం చేస్తున్నారు

తీర ప్రాంతంలో అసైన్డ్ భూములను చెరబట్టి రిసార్టులు కట్టి దర్జాగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులకు ప్రస్తుత ప్రభుత్వంలో కళ్లెం పడుతుందని అందూ భావించారు. అయితే ఈ ప్రభుత్వంలో కూడా నోటీసుల జారీతో సరిపెట్టారు తప్పితే ఇప్పటి వరకు ఒక్క అనధికార రిసార్టుపై చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. ఎస్టీలు వేసుకున్న గుడిసెలనే అడ్డగోలుగా గత ప్రభుత్వంలో కూల్చివేయడం వెనక అసైన్డ్ మాఫియా హస్తం ఉందనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. తీర ప్రాంతంలో దాదాపుగా 18 వరకు అక్రమ రిసార్టు కట్టడాలు ఉన్నాయని తేల్చిన అధికారులు వాటికి మొక్కుబడిగా నోటీసులు జారీ చేయడంతో సరిపెటారు తప్ప, చర్యల విషయంలో అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవు. అక్రమార్కులు సొమ్ము చేసుకుంటుంటే వారికి సహకరించిన ఉద్యోగులు యథాస్థానాల్లో విధులు నిర్వహిస్తూ తమను ఎవరేం చేయలేరన్న ధీమాను వ్యక్తబరచడం గమనార్హం

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు దాదాపు 80 మంది

ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లాస్థాయి అధికారు లు మాత్రమే పెద్ద ఎత్తున జరిగాయి తప్పితే కింది స్థాయి సిబ్బంది విషయంలో పెద్దగా చేర్పులు మార్పులు జరగలేదు. గత ప్రభుత్వంతో అంటకాగిన వారు సైతం ఇప్పుడు కూడా చోటా మోటా నాయకులు అండతో అదే స్థానాల్లో కొనసాగడమో లేక పక్క మండలానికి మారడమో జరిగిందే తప్ప వారు చేసిన తప్పుల విషయంలో చర్యలు అనేవే లేకుండా పోయా యి. పలు ఆరోపణలకు సంబంధించి జిల్లాలో కిందిస్థాయి ఉద్యోగులకు సంబంధించి దాదాపు 80 మంది నోటీసులు అందుకోవడమో లేక విచారణలో భాగంగా వారి పేరు చేర్చడమో జరిగింది.

ఇప్పుడూ అదే దారి...

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు సంబంధించి జరుగుతున్న దర్యాప్తులు ఆ రీతిన ఉంటే ఈ ప్రభుత్వం కొలువుదీరాక కూడా కొన్ని కీలక కేసుల విషయంలో అదే రీతిన తాత్సారం జరగడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బాపట్ల రూరల్ పరిధిలో మత్తు అవశేషాలు కలిగిన డ్రగ్స్ మాత్రలు దొరికినట్లు సదరు విభాగం ప్రాథమికంగా నిర్ధారించింది. ఘటన జరిగి దాదాపు మూడు వారాలు కావొస్తోంది ఇప్పటికీ ఆ దర్యాప్తు ఏ దశలో ఉందనేది ఎవరికీ అంతుబట్టని విషయంగా ఉంది. రేషన్ మాఫియాకు సంబంధించి పదేపదే 6ఏ కేసుల్లో పట్టుబడిన వివరాలు సేకరించి తీవ్రత కలిగిన కేసుల్లో పీడీయాక్టు అస్త్రం ప్రయోగిస్తామని ఈ ప్రభుత్వంలోనే చెప్పారు. కానీ ఇంతవరకు పదేపదే పట్టుబడుతున్న 6ఏ కేసులపై దర్యాప్తు జరిపిందీ లేదు, పీడీ యాక్టు పెట్టిందీ లేకపోవడం గమనార్హం.

కానిస్టేబుల్ ఆత్మహత్య

- వేరుగా ఉంటున్న దంపతులు
- భరణం కోసం కోర్టును ఆశ్రయించిన భార్య
- కోర్టుకు హాజరవ్వాల్సిన రోజే బలవన్మరణం

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య నెలకొన్న వివాదం కారణంగా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన బిళ్లా రమేష్‌బాబు (39) చాలా కాలంగా చీరాల పరిధిలోని పలు స్టేషన్‌లలో పనిచేసి, ఎనిమిది నెలలుగా బాపట్ల మండలం వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఇతనికి కారంచేడు మండలం తిమిడితపాడుకు చెందిన జెమిని అలియాస్ సింధుతో 2000లో వివాహం జరిగింది. వీరికి 12 ఏళ్ల వయస్సు ఉన్న సరళ, తొమ్మిదేళ్ల సాహితి సంతానం. అయితే గత ఐదేళ్లుగా ఇద్దరి మధ్యా నెలకొన్న వివాదాలు కారణంగా భార్య పుట్టింట్లోనే ఉంటూ కోర్టును ఆశ్రయించి భర్తపై భరణం కేసును దాఖలు చేసింది. ప్రస్తుతం ఇది కోర్టులో నడుస్తున్నది. ఈక్రమంలో భార్య గతంలోనే భర్తపై పలుమార్లు ఉన్నతాధికారులను సైతం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన కానిస్టేబుల్ రమేష్ ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి చేరారు. సోమవారం కోర్టులో హాజరు కావాల్సి ఉండగా, అర్ధరాత్రే ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే భార్య జెమిని మాత్రం కోర్టుకు హాజరై అనంతరం విషయం తెలుసుకుని అక్కడి నుంచి హుటాహుటీన కుమార్తెలిద్దరితో హాస్పిటల్ వద్దకు చేరుకుని విలపించారు. ఈనేపథ్యంలో రెండు వర్గాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒక దశలో వాగ్వాదానికి దిగారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురిని చెదరగొట్టారు. కాగా తండ్రి చనిపోయిన రోజునే పెద్ద కుమార్తె సరళ పుట్టినరోజు కావడం బాధాకరం.



కానిస్టేబుల్ బిళ్లా రమేష్ (ఫైల్)



బిక్కుబిక్కుమంటున్న ఇద్దరు కుమార్తెలు

బోరున విలపించిన తండ్రి

మృతి చెందిన కానిస్టేబుల్‌కు ఒక అక్క ఉండగా గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే తల్లి మృతిచెందింది. తండ్రి సత్యం కుమారుడి మృతిని చూసి వయో భారంతో ఉన్న తనకు దిక్కెవరని బోరున విలపించారు.

మంచినీటి పథకం పనుల్లో కదలిక

- మరింత విస్తరించేందుకు ప్రణాళిక
- రూ.102కోట్లకు పెరగనున్న వ్యయం

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో రాబోయే మూడు దశాబ్దాల పాటు ఎలాంటి మంచినీటి సమస్య లేకుండా చేసే ఉద్దేశంతో నిర్మించ తలపెట్టిన అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులలో కదలిక ప్రారంభమైంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు రూ.86కోట్ల ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ప్రభుత్వ నిధులతో అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులను ప్రారంభించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రీటెండర్‌ల పేరుతో కొంతకాలం కాలయాపన చేసి మెయిన్ పైప్ లైన్ టిడ్కో ఇళ్ల వరకు ఉండాల్సి ఉండగా, పట్టణంలోని మార్కెట్ యార్డు వరకే పరిమితం చేసి రూ.80 కోట్లకు కుదించారు. అయితే పనులు పూర్తి కాకపోగా కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో ఏడాదిన్నర కిందట పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. అద్దంకి పట్టణంతో పాటు టిడ్కో ఇళ్లు, బొమ్మనంపాడురోడ్డు, నాగులపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డులో కొత్తగా ఏర్పడ్డ లేఅవుట్‌లలోని కాలనీలకు కూడా మంచినీరు సరఫరా జరగాలన్న ఉద్దేశంతో రివైజ్డ్ అంచనాలను తయారు చేయించారు. సుమారు రూ.101.96కోట్ల అంచనాతో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న మార్కెట్‌యార్డు, ఎన్ఎస్‌పీ కాలనీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ల ప్రాంగణాలలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో పాటు అదనంగా మూడు లేఅవుట్‌లలో ప్రత్యేకంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, పైప్‌లైన్ లు ఏర్పాటు చేసే విధంగా రూపకల్పన చేశారు. ఇందుకు సంబంధించి ఇటీవల గుంటూరు ఎస్ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అద్దంకి సమగ్ర మంచినీటి పథకం పనులు, కొత్త ప్రతిపాదనలకు సంబంధించి పరిశీలన చేశారు. దీంతో త్వరలో మరలా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



అర్ధాంతరంగా ఆగిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఈవో తిమ్మానాయుడు, శంకరారెడ్డి

నేడు శింగరకొండలో ధ్వజ స్తంభం తొలగింపు

» ప్రారంభమైన పూజలు

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కొత్త ధ్వజ స్తంభం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సుమారు 4 దశాబ్దాల కిందట పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి ధ్వజ స్తంభం ఏర్పాటుకు సహకారం అందించారు. ప్రస్తుతం సుమారు రూ.7 కోట్లతో రాతి ముఖ మండప నిర్మాణం జరుగుతుండడంతో అదే సమయంలో ఇప్పటికే దెబ్బతిన్న ధ్వజ స్తంభం స్థానంలో కొత్తదానిని ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అప్పటి దాత శంకరారెడ్డి మరలా ధ్వజ స్తంభం ఏర్పాటుకు అవసరమయ్యే ఖర్చు భరించేందుకు సిద్ధం అయ్యారు. దీంతో మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి తొలగించనున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ధ్వజ స్తంభం తొలగింపునకు సంబంధించి పూజా కార్యక్రమాలను సోమవారం ఈవో తిమ్మానాయుడు, ధ్వజ స్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డి, కుమారుడు రాజశేఖరరెడ్డి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ మాజీ బ్యాంక్ డైరెక్టర్ రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండల సర్వసభ్య సమావేశం 9న ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాసుబాబు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో నేతాజీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.


ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న బ్యాంకుల ఎదుట సర్వీస్ రోడ్డుపై నిలిపిన వాహనాలు


ఆర్టీసీ పక్క రోడ్డులో పరిస్థితి ఇలా

సర్వీస్ రోడ్డే పార్కింగ్

» ప్రధాన రోడ్డులో బహుళ అంతస్తులకు లేని ఖాళీ స్థలాలు
» బ్యాంక్‌లు, వ్యాపార సంస్థలన్నీ అక్కడే
» ఎక్కడికక్కడ వాహనాల నిలిపివేత
» పాదచారులు, ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డు వెంట బహుళ అంతస్తులను పార్కింగ్ స్థలా లు లేకుండా వివిధ సంస్థలకు, వ్యాపారాలకు అద్దెలకు ఇవ్వడంతో ఆయా సంస్థల వద్దకు, వ్యాపార సముదాయాల వద్దకు వచ్చే వాహనాలకు సర్వీస్ రోడ్డు పార్కింగ్ స్థలంగా మారింది. దీంతో కనీసం పాదచారులు, ఇతర వాహనాలు ఈ రోడ్డున రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అద్దంకిలోని ప్రధాన రోడ్డు వెంబడి ఉండే బహుళ అంతస్తుల బిల్డింగ్‌లను ఎక్కువగా పలు ప్రధాన బ్యాంక్‌లు, ఇతర వ్యాపార సంస్థలు అద్దెలకు తీసుకుంటున్నాయి. అయితే ఆ బిల్డింగ్‌లకు పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో ఆక్కడకు వచ్చే ఖాతాదారులకు, వినియోదారులకు పార్కింగ్ స్థలం లేక పాదచారులు, ఇతర వాహనాలు వెళ్లే సర్వీస్ రోడ్డే ఆయా సంస్థలకు పార్కింగ్ స్థలంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతాలలో సర్వీస్ రోడ్డుపై వాహనాలు గంటల తరబడి నిలిచి ఉండడంతో కనీసం సర్వీస్ రోడ్డులో పాదచారులు, ఇతర వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న సర్వీస్ రోడ్డుతో పాటు మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డు, బంగ్లా రోడ్డు, ఆర్టీసీ పక్కరోడ్డు, గీతామందిర్ రోడ్డుతో పాటు పలు రోడ్డులలో పాదచారులకు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వ్యాపార సంస్థలుగా అద్దెకు భవనాలు తీసుకునే క్రమంలో అక్కడికి వచ్చే వారికి పార్కింగ్ స్థలం అనేది లేకుండా ఇలా సర్వీస్ రోడ్డుపైనో, లేక రోడ్డు వెంబడి వాహనాలు నిలిపి రాకపోకులకు ఇబ్బంది కలిగించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డులో, ప్రధాన రోడ్డులలో వాహనాల పార్కింగ్ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అందరు పగలు, ప్రతీకారాలు విడనాడి ఆధ్యాత్మిక చింతన కలిగి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం ఈపూరుపాలెం పద్మనాభునిపేట, దేశాయిపేటలోని విఘ్నేశ్వర కాలనీ, రామన్నపేట, కఠారిపాలెంలోని సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. ఆయా ప్రాంతాల్లో శ్రీరామ నవమి పందిళ్ల వద్ద కమిటీ ప్రతినిధులు నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య


గరటయ్య కాలనీలో మంచినీటి సరఫరాపై స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని శివారు కాలనీలలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. పట్టణంలోని టైలర్స్ కాలనీ, కలవకూరు రోడ్డు, గరటయ్య కాలనీ తదితర ప్రాంతాలలో సోమవారం పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు గురించి అడిగారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు.

రూ.6.71 లక్షలు పలికిన పూజల వేలం

బల్లికురవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వీర్ల గంగమ్మ తల్లి దేవాలయ వద్ద ఏడాది పాటు పూజలు నిర్వహించి అందులో వచ్చే ఆదాయం పొందేందుకు ఆదివారం రాత్రి నక్కబొక్కలపాడులో వేలం పాటను గ్రామ పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన చల్లగుండ్ల శ్రీనివాసరావు అను భక్తుడు రూ.6.71 లక్షలకు వేలం పాట పాడారు. గత ఏడాది ఆలయానికి రూ.4.81లక్షలు పలికింది. ఈ ఏడాది వేలం పాట ద్వారా అమ్మవారికి ఆదాయం పెరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు. వచ్చిన ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు

బల్లికురవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌గా వై.నాగరాజు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న జీవీ చౌదరి జిల్లా కేంద్రానికి బదిలీ కాగా, వీఆర్‌లో ఉన్న నాగరాజును బల్లికురవకు నియమించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి సమస్య రాకుండా పని చేస్తానన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవంతో ప్రజలతో కలిసి ముందుకు పోతామన్నారు. ఈసందర్భంగా ఎస్ఐని స్టేషన్ సిబ్బంది, టీడీపీ నేతలు మలినేని గోవిందరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ నాగరాజు

ప్రతి మూడు రోజులకోసారి చెత్త సేకరణ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపిక చేసిన గ్రామాలల్లో ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం కచ్చితంగా చేపట్టాలని ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు అన్నారు. సోమవారం డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 6 గ్రామాలల్లో ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చే క్రమంలో ఆయా గ్రామాలను ఈవోపీఆర్డీ ప్రసాదరావు సందర్శించారు. అలాగే చెత్త సేకరణ షెడ్ల వద్ద తొట్టెలను, వర్మీ కంపోస్ట్ పిట్స్‌ను పరిశీలించి అన్నింటినీ ఉపయోగింగంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నేతలు గోగులమూడి రాజేశేఖర్, హిరతరాయబారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ జంజనం, వైస్ చైర్మన్ బొనిగల, వైసీపీ కౌన్సిలర్‌లు

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కమిషనర్ తీరు సక్రమంగా లేదని మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. సోమవారం కలెక్టర్ వెంకట మురళిని కలిసి కౌన్సిలర్లు, నాయకులతో కలిసి చైర్మన్ ఫిర్యాదు చేశారు. ఇటీవల బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజున చోటుచేసుకున్న వివాదంతోపాటు పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

'మీకోసం'కు 9 దరఖాస్తులు

పంగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసంలో 9 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. భూమి కొలతలకు సంబంధించి 7, ఒన్ ఏ కోరుతూ 1, భూమి కోరుతూ 1 దరఖాస్తు అందినట్లు తెలిపారు.

కారంచేడులో జూదరుల అరెస్టు

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకట్రావు ఆదివారం రాత్రి దాడి నిర్వహించారు. ఈదాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.27వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం సాయంత్రం పాత మద్రాసు రోడ్డులోని నూతపాడు నక్కవాగు సమీపంలో జరిగింది. నూతలపాడు గ్రామానికి చెందిన మార్కు సంగీతరావు తన ద్విచక్రవాహనంపై పర్చూరు నుంచి నూతలపాడు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన సంగీతరావును 108 లో ప్రభుత్వాసుపత్రికి, అనంతరం గుంటూరుకు తరలించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

సంతమాగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఏల్చూరులో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కలిసి కోరారు.

వచ్చేనెల 27న నాంచారమ్మ తిరునాళ్ల

పర్చూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని గ్రామ దేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల నిర్వహణపై ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు నేతృత్వంలో వంశపారంపర్య అర్చకులు సోమవారం సమావేశం నిర్వహించారు. స్వామివారి తిరునాళ్ల, సిడిమహోత్సవం ఏర్పాటుపై చర్చించిన అనంతరం మే 27న అమ్మవారి తిరునాళ్లకు తేదీని ఖరారు చేసినట్లు ఈవో తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌కు సన్మానం

సంతమాగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రప్రదేశ్) : మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తేలప్రోలు రమేష్‌కు సోమవారం మండల పరిషత్ సిబ్బంది ఎంపీడీవో హాలులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ శివరాం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ మండల నాయకులతో కలసి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి గొట్టిపాటి సూచించారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో స్వరూపారాణి

చలివేంద్రాల ఏర్పాటు

పంగులూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులోని ప్రధాన కూడళ్లలో సోమవారం మూడు చలివేంద్రాలను ఎంపీడీవో స్వరూపారాణి ప్రారంభించారు. బస్ స్టాండ్ సెంటర్‌తో పాటు శేణుగోపాలస్వామి ఆలయం, మరో బస్ షెల్టర్ వద్ద వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామ పంచాయతీ వారు ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమంత్, టీడీపీ నేతలు మేడ సుబ్బారావు, చిలుకూరి కోటయ్య, గుడిపూడి రామారావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సంధ్య, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడగాలులపై జాగ్రత్తలు పాటించండి

తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేడి గాలుల ప్రభావం నుంచి జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం కార్యాలయం ప్రాంగణంలో ప్రజలకు తాగు నీరు అందుబాటులో ఉంచేందుకు చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేడి గాలుల తీవ్రతను సిబ్బందికి వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తొట్టెలను వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పొలాలకు తోలుకు వెళ్లే పశువులకు వేసవి తాపం లేకుండా ఏర్పాటు చేస్తున్న నీటి తొట్టెలను పశు పోషకులు, గొర్రెల కాపరులు వినియోగించుకోవాలని ఒంగోలు పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ ఏ.రమేష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మయపాలెం, బొమ్మనంపాడు గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న నీటి కుంటలను అద్దంకి పశు వైద్యశాల ఏడీ డాక్టర్ ఎం.మోహనరావు, బొమ్మనంపాడు పశువైద్యాశాల వైద్యులు డాక్టర్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఏఏ గ్రామాలలో నీటి కుంటల ఏర్పాటు జరుగుతుంది, ప్రస్తుతం అవి ఏఏ దశలలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వెంపరాల, కోటిలపూడి, కుంకుపాడు, మోదేపల్లి గ్రామాలల్లో మొదటి విడతగా మొత్తం 5 నీటి కుంటలు మంజూరయ్యాయని తెలిపారు. 75 శాతం సబ్సిడీ కింద గడ్డి విత్తనాలను అందజేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పథకాలను సద్వినియోగపర్చుకోవలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరావతికి బస్సు సౌకర్యం కల్పించండి

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల నుంచి అమరావతి సచివాలయం, హైకోర్టుకు తదితర పనుల నిమిత్తం రాజధానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని పేరాల నేతాజీ సేవా సమితి ప్రతినిధులు కోరారు. సోమవారం ఆర్టీసీ డీఎం శ్యామలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లినట్లు చెప్పారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణానికి అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. దీనిపై అధికారులు సానుకూలంగానే స్పందించారు. కార్యక్రమంలో రామారావు, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.


ఆర్టీసీ డీఎం శ్యామలకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఎమ్మెల్యే గారూ.. మా సమస్యలు పట్టించుకోరూ..!

» అధ్వానంగా తాగునీటి పైపులు
» దెబ్బతింటున్న అంతర్గత రహదారులు
» ఇదీ ముత్యాలపేటలో పరిస్థితి

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డు ముత్యాల పేటలో కరూర్ వైశ్యాబ్యాంక్ నుంచి మొదలుకుని అధిక శాతం అంతర్గత రహదారులు, డ్రెయిన్‌లు ఘోరంగా ఉన్నాయి. ముఖ్యంగా బ్యాంకు వెనుక రహదారిలో తాగునీటిపైపులు సైతం రోడ్డుపైనే నడిపించడంతో అవి ఎప్పుడు పగలిపోతాయే అర్థం కాని పరిస్థితి. గతంలో తాగునీరు అందించేందుకు రోడ్లను ఇష్టారీతిగా అడ్డంగా పగలకొట్టి విద్యుత్ వైర్లకు అమర్చే పైపులు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. మరో వైపు ఆ మార్గంలో కొంతమంది రహదారులను ఆక్రమించి దుకాణాలకు సంబంధించి కార్యకలాపాలు సాగిస్తున్నారు. పైగా అధిక లోడుతో వచ్చే చిన్న వాహనాల వల్ల తాగునీటి పైపులు దెబ్బతినే పరిస్థితి ఉంది. కొందరు వ్యాపారాల వ్యర్థాలను కాలువల్లో పడేస్తుండడంతో పారిశుధ్యం క్షీణించింది. దీంతో దోమలు విజృంభించి ప్రజల కంటి మీద కునుకులేకుండా చేఉస్తున్నాయి. పాలకులు వార్డు సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


రోజూ వ్యాపార కార్యకలాపాలు సాగించే చిన్న రోడ్డు


డ్రెయిన్‌పై అస్తవ్యస్తంగా ఉన్న తాగునీటి పైపులు

కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.2.30కోట్లు మంజూరు

అద్దంకి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 7 గ్రామాలలో కొత్తగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ.2.30కోట్ల నిధులు మంజూరైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రాసంగులపాడు, పమిడిపాడు, కుంకుపాడు, మోదేపల్లి, బూదవాడ, కొమ్మినేనివారిపాలెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, కొమ్మాలపాడులో కాపు సామాజికవర్గానికి కమ్యూనిటీ హాల్స్ మంజూరైనట్లు తెలిపారు.

పున్నారెడ్డికి మంత్రి గొట్టిపాటి పరామర్శ

మేదరమెట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు కనుబొద్ది పున్నారెడ్డి భార్య పున్నమ్మ గుండె సమస్యతో మరణించారు. సోమవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తూర్పుపాలెంలోని పున్నారెడ్డి నివాసానికి వెళ్లి పున్నమ్మ మృతికి కారణాలను అడిగి తెలుసుకొని కుటుం సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు భవానీప్రసాదరెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


పున్నారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

చీరాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రోటరీక్లబ్ హాలులో వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమారం ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మారుతు న్న కాలానుగుణంగా తీసుకోవాల్సిన జాగ్ర త్తలు డా.ఐ.బాబూరావు వివరించారు. షుగర్, గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ధూమపానం, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండడం తోపాటు పౌష్టిక ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని సూచించారు. అనంతరం ప్రతినిధులు డా.బాబూరావును సత్కరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, సురేష్, వీరాంజనేయులు,బదిరి, తిరుపతిరావు పాల్గొన్నారు.

పంగులూరు: పాఠశాల స్థాయి నుంచి బాల బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బాల రాజేశ్వరి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రామకూరు ప్రాథమికోన్నత పాఠశాల బాల బాలికలకు సోమవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పాలు, గుడ్లు, పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగాసనాలు, వాకింగ్‌తో పాటు శరీరానికి సరిపడా నీరు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పాలు, గుడ్లు తీసుకోవాన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ హరిబాబు, ఏఎన్‌ఎం శ్రావణి, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణ (పర్చూరు) : కారంచేడు మండలం స్వర్ణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య దినోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శాలిని ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


డాక్టర్ బాబూరావును సత్కరిస్తున్న ప్రతినిధులు



రోగుల సంచారం పెద్దగాలేని పొగతోటలోని ఆసుపత్రుల ప్రధాన వీధి

'ఆరోగ్యశ్రీ' సేవలకు బ్రేక్!

జిల్లాలోని 35 ఆసుపత్రుల్లో వైద్యసేవలు బంద్

అత్యవసర సేవలు మాత్రమే కొనసాగింపు

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ (ఆరోగ్యశ్రీ) కింద అందించే వైద్యసేవలు సోమవారం జిల్లాలో చాలా వరకు నిలిచిపోయాయి. ఏపీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) ఇచ్చిన పిలుపు మేరకు నెట్‌వర్క్ ఆసుపత్రులు తమ సేవలను ఆపేశాయి. రోగులకు అత్యవసర వైద్యసేవలు మాత్రం అందచేస్తున్నాయి. జిల్లావ్యాప్తం గా 132 నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో 35 ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద అత్యవసర వైద్యచికిత్సలు అందించే ఆసుపత్రులు, 31 దంత వైద్య శాలలు ఉన్నాయి. మిగిలినవన్నీ ప్రభుత్వ ఆసుపత్రులే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు కొనసాగాయి. ఇక ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి తప్ప మిగిలిన ఆసుపత్రులన్నీ తమ ఓపీ సేవలను ఆపేశాయి. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో మూడేళ్లుగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.కోట్ల బకాయిలు పెట్టంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ ఆయా ఆసుపత్రులకు రూ. 150 కోట్లకు పైగా బకాయిలు పేరుకు పోయాయి. దీంతో వైద్యులు, సిబ్బందికి నెలవారీ వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ స్థితిలో ఆశా ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేశాయి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిం చకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని నెట్‌వర్క్ ఆసుప త్రుల నిర్వాహకులు హెచ్చరి స్తున్నారు. ఇదిలాఉంటే నెట్‌వర్క్ ఆసుపత్రుల నిరసనలపై ప్రభుతం స్పందించకుంటే బంద్ చేస్తామని ఆశా పేర్కొంది.

ప్రభుత్వ స్పందన ఏదీ ?



నెట్‌వర్క్ ఆసుపత్రుల నిరసనలపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు. దీంతో ఓపీ సేవలు నిలిపివేశాం. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ పథకాన్ని కొనసాగించాలంటే ప్రభుత్వం నిర్దిష్టమైన హామీ ఇవ్వాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నాం.

- డాక్టర్ నారాయణరావు, ఆశా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యాయాధికారుల బదిలీ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా పనిచేస్తున్న సీ.యామినిని కడప జిల్లా ప్రధాన న్యాయాధికారిగా బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో అనంతపురం జిల్లా ప్రధాన న్యాయాధికారిగా పనిచేస్తున్న జీ. శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే నెల్లూరు ఫ్యామిలీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారిగా పనిచేస్తున్న కే. వెంకట నాగపవన్‌ను తిరుపతి జిల్లా గూడూరు ఏడవ అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న షేక్ పర్వీన్ సుల్తానా బేగంను గుంటూరు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారిగా నియమించారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సోమవారం ఉత్తర్వులు అందాయి. బదిలీ అయిన న్యాయాధికారులు ఈనెల 21 లోగా బాధ్యతలు చేపట్టాలని హైకోర్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.



పొలంలో నిల్వ ఉన్న పసుపు కొమ్ములు

పసుపు... పసిడాయే!

గత నెలలో క్వింటం రూ.8.500.. ఇప్పుడు 12,700

సాగుదారుల్లో ఆనందం

ఉదయగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పసుపు సాగుదారుల ఇంట సిరులు కురుస్తున్నాయి. రోజురోజుకు ధరలు పెరుగుతుండటంతో వారి కష్టానికి ఫలితం దక్కుతోంది. గతేడాది జూన్, జూలై నెలల్లో ఉదయగిరి ప్రాంతంలోని రైతులు పసుపు సాగు చేశారు. ఎకరా సాగుకు దున్నకం, విత్తనం, ఎరువులు, పురుగు మందులు కలిపి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతోంది. ఈ ఏడాది జిల్లాలో సుమారు 600 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ప్రస్తుతం తవ్వకాలు పూర్తయి ఉడికిచేందుకు పసుపుగొమ్ములను పొలాల్లో నిల్వ ఉంచారు. కొందరు రైతులకు ఎకరాకు 25 నుంచి 35, మరికొందరికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 2008, 2009లో క్వింటం పసుపు ధర రూ.18 వేలు పలకగా, 2010 నుంచి 2023 వరకు క్వింట రూ.5వేల నుంచి 6,500 వరకు మాత్రమే పలికింది. దీంతో రైతులు నష్టాలు చవిచూశారు. అయితే 2024లో క్వింటం రూ.16 వేలు పలికడంతో గట్టెక్కారు. ఈ ఏడాది మార్చిలో క్వింటం రూ.8,500 పలకగా, ప్రస్తుతం రూ.12,700 పలుకుతోంది. ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

రక్తపోటు.. చక్కెర కాటు

జిల్లాలో ప్రతి పాతికమందిలో ఒకరు హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారా!? అలాగే ప్రతీ నలభై మందిలో ఒకరు డయాబెటిస్ బారిన పడ్డారా!? అంటే ప్రభుత్వ గణాంకాలు అవుననే చెబుతున్నాయి. వినడానికి కొంచెం ఉన్నా హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఎన్‌సీడీ సర్వే (దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ సర్వే) పూర్తయింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సర్వేలో వెల్లడైన కొన్ని వ్యాధుల తీవ్రతను చూస్తే ఆందోళన కలిగిస్తోంది.

నెల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట ప్రజల ఆరోగ్యస్థితిగతులపై ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఎన్‌సీడీ సర్వే పూర్తవగా, ఆ సర్వే వివరాలను విడుదల చేశారు. అందులో జిల్లాలోని వివరాలనూ వెల్లడించారు. ఈ సర్వేలో వెల్లడైన కొన్ని వ్యాధుల తీవ్రతను చూస్తే ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా లివర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడిన వారు జిల్లాలోనే ఎక్కువగా ఉన్నారు. పొల్యూషన్ ఎక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణంగా అంచనా వేస్తున్నారు. లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు రాష్ట్రవ్యాప్తంగా 30,646 మంది ఉండగా వారిలో ఒక్క నెల్లూరు జిల్లాలోనే 2168 మంది ఉన్నారు. అలానే శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు రాష్ట్రవ్యాప్తంగా 54,362 మంది ఉండగా వారిలో జిల్లాలో 5,204 మంది ఉన్నారు. ఈ రెండూ దీర్ఘకాలిక వ్యాధులతో ఎక్కువగా బాధపడుతున్న జిల్లాల్లో నెల్లూరు మొదటి స్థానంలో ఉంది. జిల్లాలో 20 లక్షల మంది జనాభా ఉంటే వారిలో సుమారు 95 వేల మంది హైపర్‌టెన్షన్, డయాబెటిస్ వంటి వాటితో బాధపడు తున్నారు. మారుతున్న జీవన స్థితిగతులే ఇందుకు ప్రధాన కారణంగా వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు.

- జీవనశైలిలో మార్పులతో ప్రమాద ఘంటికలు
- ఎన్‌సీడీ సర్వే వివరాల వెల్లడి
- 94,677 మందికి హైపర్‌టెన్షన్, డయాబెటిస్
- శ్వాసకోస, లివర్ సమస్యల్లో జిల్లా టాప్
- 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' పేరుతో ప్రత్యేక కార్యాచరణ







● దృష్టిపెట్టిన ప్రభుత్వం

ఈ దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు రాష్ట ప్రభుత్వం 'ఆరోగ్య అంధ్రప్రదేశ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా ఈదఫా ఎన్‌సీడీ సర్వేను వినూత్నంగా నిర్వహించింది. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని అక్కడ ఏ రకమైన వ్యాధులతో ఎక్కువగా బాధపడుతున్నారన్న విషయాలను గుర్తించింది. జిల్లాలో లివర్, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించింది. అందుకు తగిన విధంగా భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతీ నియోజకవర్గంలో కనీసం ఒక 100 నుంచి 300 పడకల ఆసుపత్రి ఉండేలా భావిస్తోంది. ఇటువంటి ఆసుపత్రులు లేని నియోజకవర్గాల్లో పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణకై పరీక్షలకు చాలా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇకపై ఆ ఖర్చులను తగ్గించి, తక్కువ ధరకే పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. అలానే ప్రతీ నియోజవకర్గంలోనూ డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడకు ఏ వ్యాధితో వెళ్లినా అందుకు అవసరమైన వైద్యుడి వద్ద ఫాస్ట్రాక్ అపాయింట్‌మెంట్ బుక్ చేస్తారు. ఇంకా అవసరమైతే స్పెషలిస్ట్‌లతో వర్చువల్ కన్సల్టేషన్ ఇస్తారు. ఈ డిజిటల్ నెర్వ్ సెంటర్ల నుంచే తాలూకా, జిల్లా ఆసుపత్రులకు రిఫరల్ అపాయింట్‌మెంట్లు ఇస్తారు. అలానే పేషెంట్‌కు సంబంధించి ఆసుపత్రుల రికార్డులన్నింటినీ స్కాన్ చేసి భద్రపరుస్తారు.

వ్యాధి పేరు	రాష్ట్రంలో కేసులు	జిల్లాలో కేసులు
హైపర్‌టెన్షన్	19,78,699	82,116
డయాబెటిస్	11,13,639	56,250
హైపర్‌టెన్షన్+ డయాబెటిస్	20,78,999	94,677
గుండె	2,61,100	11,277
క్యాన్సర్	1,19,397	5,487
లివర్	30,646	2,168
శ్వాసకోశ	54,362	5204
నరాలు	1,07,433	5,837
కిడ్నీ	1,73,479	8,017



ఈ-శ్రమ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక శాఖల్లో పనిచేసే అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే అమెజాన్, జొమేటో, స్విగ్గీకొరియర్ బాయ్స్, ఓలా, ఫ్లిప్‌కార్ట్ కార్మికులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అలాగే ప్రధాని జన ఆరోగ్య యోజన కార్మికులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులయినవారు కార్మికశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 17 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వివరించారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 52.590 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు నిలుపుదల చేశారు. కండలేరుకు 100 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జూనియర్ కళాశాలల్లో

హేతుబద్ధీకరణ

● జిల్లాలో 40కిపైగా అధ్యాపక పోస్టుల మంజూరు

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల హేతుబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 455 జూనియర్ లెక్చరర్స్ సర్‌ప్లస్ పోస్టులను గుర్తించగా, వీటిలో 214 పోస్టులను యథాతథంగా అవసరం ఉన్న కొత్త కళాశాలలకు బదిలీ చేస్తున్నారు. మిగిలిన 241 పోస్టులను ఇతర సబ్జెక్ట్‌లకు మార్పు చేసి కొత్త కళాశాలలకు కేటాయించనున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన దామరమడుగు, తోటపల్లిగూడూరు, సౌత్‌మోపూరు, వెంగమాంబాపురంలలోని జూనియర్ కళాశాలలకు గతంలో ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు. ప్రస్తుత హేతుబద్ధీకరణలో ఒక్కో కళాశాలకు పదిపోస్టుల చొప్పున 40 పోస్టులు మంజూరు కానున్నాయని ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు. వీటితో పాటు మిగిలిన కళాశాలల్లో కూడా సర్‌ప్లస్ పోస్టులను గుర్తించి అవసరమైన చోట సర్దుబాటు చేస్తామన్నారు. జూనియర్ కళాశాలల్లో ఇప్పటికే ద్వితీయ సంవత్సరం ప్రారంభం కాగా, 7వతేదీ నుంచి ప్రథమ సంవత్సరం కూడా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అధ్యాపకుల నియామకాలు కూడా వేగవంతంగా చేపడతామని తెలిపారు.



చేవూరును పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలి

● కలెక్టరేట్ వద్ద బాధితులు, సీపీఎం, సీఐటీయూ నాయకుల ధర్నా

కందుకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు మణిహారంగా ఉన్న చేవూరు గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలని, పోర్టు సంబంధిత అభివృద్ధి కోసం భూములు నష్టపోయిన నిర్వాసితులకు తక్షణం పరిహారం చెల్లించాలని బాధితులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం, సీఐటీయూ నాయకులతో కలసి నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నేత జీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నా నిర్వాసితులకు పరిహారం చెల్లించటంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గ్రామానికి చెందిన నాయకుడు నూతలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామప్రజల జీవనోపాధి దెబ్బతినకుండా చుట్టూ వెయ్యి మీటర్లు వదిలేసి భూసేకరణ జరపాలని డిమాండ్ చేశారు. చేవూరు చెరువులో బోటు షికారు ఏర్పాటు చేయడంతోపాటు గ్రామ పరిధిలో భూసేకరణకు రోడ్డు పక్క భూములు, పండ్ల తోటలకు క్లాసిఫికేషన్ అమలు చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు.

వృద్ధులకు డిజిటల్ కార్డులు



గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం

అందుబాటులోకి రానున్న కొత్త సేవలు

ఈ కార్డుతో సీనియర్ సిటిజన్లకు ప్రయోజనాలు

సంగం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు సేవలు పొందేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డును ప్రభుత్వం ఇవ్వనున్నది. ఈ కార్డును డిజిటల్ రూపంలో అందించనుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ డిజిటల్ కార్డు అందించేలా కొత్త సేవను తీసుకువచ్చింది. అక్కడ నుంచే వారు దరఖాస్తు చేసుకోవాలి. ఇటీవల అమరావతిలో జరిగిన సీనియర్ కౌన్సిల్, స్టేట్ అడ్వైజర్ బోర్డు ఆన్ డిజిటబులిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవటంతో సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల జారీకి మార్గం సుగమమైంది. ఈ కార్డుతో పలు ప్రయోజనాలు ఉన్నాయి.

- భారత రైల్వే సంస్థ రైలు ప్రయాణంలో 60 ఏళ్లు నిండిన పురుషులకు, 58 ఏళ్లు నిండిన మహిళలకు టికెట్‌పై 40 శాతం రాయితీ, 80 ఏళ్లు నిండిన వారికి 50 శాతం రాయితీ కల్పిస్తున్నది. కొన్ని ప్రైవేట్ బస్సు సర్వీస్‌లు, ఎయిర్ లైన్స్ సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరలు తగ్గిస్తున్నాయి.
- ఈ కార్డు ఉంటే ఆస్పత్రుల్లో ప్రత్యేక క్యూలు, రాయితీలకు అవకాశం ఉంది. మందులు, డయాటగ్నోస్టిక్ టెస్ట్‌ల ధరలు తగ్గుతాయి.
- సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీ, ఎఫ్‌సీఎస్‌ఎస్ సేవింగ్ స్కీమ్‌లపై అధిక వడ్డీ, ఇన్‌కంట్యాక్స్ మినహాయింపు (80 ఏళ్ల పైబడినవారికి రూ. రూ. 50 వేల వరకు)ఉంటుంది.
- ఇందిరాగాంధీ నేషనల్ ఓల్డేజ్ పెన్షన్ స్కీమ్ వంటి పథకాలకు అర్హత, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అదనపు సబ్సిడీలు అందుతాయి.
- మ్యూజియం, సినిమా హాళ్లు, పార్కుల్లో ఎంట్రీ ఫీజుల్లో రాయితీ, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలో తగ్గింపు ఉంటాయి.
- వృద్ధుల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం, ఆరోగ్యం భద్రతకు ప్రాధాన్యం, ప్రభుత్వ ప్రయోజనాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడం వంటి సేవలు ఈ కార్డు ద్వారా అందుబాటులోకి రానున్నాయి.



ఆరు మండలాల్లో

జొన్నల కొనుగోళ్లు

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆరు మండలాల్లో కనీస మద్దతు ధరతో జొన్నల కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాడు, వరికుంటపాడు, ఆత్మకూరు, పొదలకూరు, కలువాయి, చేజర్ల మండలాల్లో హైబ్రిడ్ రకం జొన్నలు క్వింటం రూ.3371, మాల్దండి రకం క్వింటం రూ.3421 చొప్పున మద్దతు ధర ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే జొన్నలు విక్రయించాలని రైతులను కోరారు.



శేషవాహనంపై శ్రీరామచంద్రుడు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని త్యాగరాజస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్వామివారికి శేషవాహనసేవ, ప్రాకారోత్సవం జరిగాయి. ఉదయం తిరుమంజనం సేవ, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 440

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8534
వెండి కిలో ధర	రూ. 92.500
వెండి ఒక గ్రాము	రూ.95.50

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగసముద్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణశాఖల పరిధిలో జరిగిన రూ.13.67 కోట్ల పనులకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఏపీవో షేక్ సమీర్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పనులకు సంబంధించి గత నెల 18 నుంచి 31 వరకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో విచారించారని పేర్కొన్నారు. తద్వారా రూపొందించిన నివేదికలను ప్రజా వేదికలో అధికారులకు, ప్రజలకు చదివి వినిపిస్తారని తెలిపారు.

న్యూస్ బాక్స్

336 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 425 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో ఎనిమిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 336 బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-2, నోబిడ్-63, ఆర్ఆర్-3, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-13 కారణాలతో 89బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.263.61గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు.

గోవు దాడిలో నలుగురికి గాయాలు

అల్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అల్లూరులో సోమవారం రాత్రి ఓ గోవు దాడిలో నలుగురు పాదాచారులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నలుగురు వ్యక్తులు వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా వీధుల్లో తిరుగుతుండే ఒక గోవు ఒక వ్యక్తిపై దాడి చేసింది. పక్కనే ఉన్న మరో ముగ్గురు దానిని నిలువరించేందుకు ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేసింది. స్థానికులు అతి కష్టంపై దానిని నిలువరించారు. అప్పటికే గాయపడిన నలుగురిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

జగనన్న కాలనీల అవినీతిపై విచారణ జరిపించాలి

కావలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో స్టీలు, సిమెంట్, ఇసుక దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పెయ్యల శ్రీను, డీ.వెంకటేశ్వర్లు, జెడ్డా వాసు, తిరుపతి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి పలువురి సంతాపం

కొండాపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గొర్రెపాటి లక్ష్మీనరసయ్య(75) ఆదివారం రాత్రి మృతి చెందగా పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ లక్ష్మీనరసయ్య కుటుంబ సభ్యులను ఫోనులో పరామర్శించి పార్టీ ఆదుకుంటుందని చెప్పారు.

కోలాహలంగా కోదండరాముడి రథోత్సవం



అల్లూరు: కోదండరాముడి రథోత్సవం

అల్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుపేటలో వెలసి ఉన్న కోదండరాముడి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లంపాటి ఇందిరమ్మ, అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూలాలంకరణ చేసిన రథంలో కొలువుదీరిన సీతా లక్ష్మణ సమేత కోదండరాముడు పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అల్లూరు తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కోదండరాముడి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

● **కనుల పండువగా...**

కావలిటౌన్ : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని దక్షిణంపేట రామాలయం వద్ద సోమవారం సాయంత్రం ప్రారంభమైన రథోత్సవం మాగుంట పార్వతమ్మ రోడ్డు మీదుగా పట్టణ పురవీధుల్లో సాగింది. సీతారాములు రథంపై ఆశీనులై ప్రజలకు దర్శనమిచ్చారు. జై శ్రీరామ్ నామస్మరణతో భక్తులు రథం లాగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు, భక్తబృందం పాల్గొన్నారు.



కావలి : సీతారాముల రథోత్సవంలో భక్తులు

కొండాపురం : మండలంలోని భీమవరప్పాడు, గుడవళ్లూరు గ్రామాల్లోని రామాలయాలలో పారువేట సందర్భంగా సీతారాముల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఎమ్మెల్సీ రవిచంద్రకు పౌరసన్మానం

● గ్రంధి విగ్రహావిష్కరణ ● కావలికి ఇద్దరు మంత్రుల రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర ఎమ్మెల్సీగా ఎన్నికైన తరువాత తొలిసారి కావలి నియోజకవర్గంలో అడుగుపెడుతున్న సందర్భంగా మంగళవారం పౌరసన్మానం చేయనున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే టీడీపీ నేత గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కావలిలోని ఆయన నివాసంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిలు మంగళవారం కావలికి వస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా తన ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత టీడీపీ నేత గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రులు మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు ఆవిష్కరిస్తారన్నార. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి ట్రంకు రోడ్డులోని సెల్ఫీ ఐకాన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీద రవిచంద్రకు పౌరసన్మానం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

ప్రతిభావంతులకు అభినందన

కావలిటౌన్ : ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన ఐఎంవో, ఐఎస్‌వో పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన కావలి నలందా ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులను సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో నలందా డైరెక్టర్ ఎండీ వశీం, తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ : త్రుటిలో తప్పిన ప్రమాదం

కావల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ట్రంకురోడ్డులో రైల్వే రోడ్డుకు వెళ్లే మలుపు వద్ద ప్రధాన తపాలా కార్యాలయం పక్కన కరెంట్ తీగ (కండక్టర్) సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు తగలటంతో తెగి నేలపై పడింది. అప్పుడే కొంత మంది రోడ్డు క్రాస్ చేసిన తర్వాత కరెంట్ వైరు తెగి నేలమీద పడింది. ఆ సమయంలో అక్కడ ప్రజలు లేక పోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కరెంట్ తీగలను బస్సు ఒక చోట తగిలితే అది మరొక చోట తెగడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా ఎక్కడ తీగ మెతకగా ఉంటుందో అక్కడ తెగుతోందని విద్యుత్ శాఖ సిబ్బంది అంటున్నారు. కరెంట్ తీగ తెగిన విషయం స్థానికులు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో పోలీసులుఅక్కడకు చేరుకుని ఆ మార్గంలో ఎవరినీ రాకుండా రక్షణగా నిలిచి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరాను నిలిపి వేసిన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తెగిన కరెంట్‌తీగకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



తెగిన కరెంట్ తీగ వద్ద కాపాలా ఉన్న పోలీసులు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కావలిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి తాలూకా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెన్షనర్స్ భవనంలో సంఘం అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో వైద్యరత్న బిరుదాంకితుడు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు అధ్యక్షతన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు అపోలో వైద్యశాలకు చెందిన గుండె, మూత్రపిండాలు, జీర్ణకోశ వ్యాధుల వైద్యులు షర్మిలి నౌషీన్, మస్తాన్‌వలి, సతీష్ పగడాల పాల్గొని పెన్షనర్లకు పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు ఇచ్చారు. రవికుమార్, వెంకయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరసన

బిట్రగుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైల్వే రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై సోమవారం బిట్రగుంట రైల్వే లాబీ కార్యాలయం ఎదుట సౌత్ సెంట్రల్ బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు మద్దిబోయిన వెంకటశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వర్లు మాటాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ పీవీఆర్ బాబు, ఆర్వీ నరసయ్య, రవి, రాజేష్, కాలేషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్‌లో ప్రాంగణ ఎంపికలు

కావలిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సింగపూర్‌కు చెందిన ఏ2000 సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ టీవీ రావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేష్, ఏవో రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుకట్ట గిరిజన కాలనీకి నీటి సరఫరా చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని చెరువుకట్ట గిరిజన కాలనీవాసులకు నీటి సరఫరా చేయాలని సీపీఎం నేతలు కాలనీ గిరిజనులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ చెరువుకట్ట గిరిజన కాలనీలో 100కు పైగా కుంటుంబాలు ఉంటున్నప్పటికీ నీటి సౌకర్యం కల్పించలేదన్నారు. మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు సక్రమంగా అందడంలేదన్నారు. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం

లింగసముద్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి దాతలు కృషి అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు పేర్కొన్నారు. లింగసముద్రం హైస్కూల్‌లో 1966లో పిడుగు కోనయ్య, కోనమ్మల దాతృత్వంతో నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో వారి ముని మనవళ్లు పిడుగు వెంకటరాజు, వెంటక రంగారావులు రూ.4 లక్షలతో నాలుగు తరగతి గదులకు మరమ్మతులు చేయించారు. అందుకు సబంధించిన శిలాఫలకాన్ని సోమవారం రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టే వెంకటాచార్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరాజు, శిరీష, వెంకట రంగారావు, కళ్యాణి దంపతులు, మొగిలిచెర్ల హైస్కూల్ హెచ్‌ఎం కె సూర్యప్రకాశరావు, ఎస్ఎంసీ చైర్మన్ దగ్గు వెంకట రమేష్, యు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కావలిరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆముదాలదిన్నెలో సోమవారం పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వెంకటరమణయ్య పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. ఎస్టీ కాలనీలో చేతి పంపులు, కుళాయిల్లో నీరు మురుగుగా మారి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఇలాగైతే రోగాలు రావా అని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించి ఎస్టీ కాలనీలో చేతి పంపుల్లో నీరు రోడ్డుపైకి చేరకుండా కాలువలు తీసి బ్లీచింగ్ పిచికారీ చేయించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం

కావలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు తాగునీటికి ఇబ్బంది పడకుండా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆద్వి ఫౌండేషన్ వారి సహకారంతో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజరు ఎం.కల్పన, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, సభ్యులు హరినారపరెడ్డి, మోడరన్ నరసింహం, ఆరికట్ల మధుసూదనరావు, జనిగర్ల మనోహర్, ఆద్వి ఫౌండేషన్ అధ్యక్షుడు బెజవాడ ప్రసన్నకుమార్, సభ్యుడు వీ.వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కుల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బిట్రగుంట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రక్కుల చోరీ కేసులో నిదితుడిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై భోజ్యా తెలిపిన వివరాల మేరకు.. ఏటీ కండ్రిగకు చెందిన షేక్.షరీఫ్ ఇంటి ఇటీవల చోరీకి గురైన రెండు ట్రాక్టర్ ట్రక్కులు ఉన్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేసి ట్రక్కులతో పాటు చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్ ఇంజన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

అంకమ్మకు వెండి జడ, 110 వెండి పుష్పాల బహూకరణ

కందుకూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయానికి కావలికి చెందిన చలంచాల్య సూర్యప్రకాశరావు, సీతాదేవి దంపతులు బంగారుతాపడంతో వెండి జడ, 110 వెండిపుష్పాలను బహూకరించారు. అమ్మవారి పట్ల ఉన్న భక్తితో వృద్ధ దంపతులు సోమవారం ఆలయానికి వచ్చి ఈవో కార్తీక్‌కు వీటిని అందజేశారు. ఈఓ మాట్లాడుతూ వీటి విలువ రూ. 1.70 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ విశ్రాంత ఈవో రామ్‌కుమార్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు మురళీమోహన్, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, గాండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వెండి జడ అందిస్తున్న సూర్యప్రకాశరావు

శేష వాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు



సంగం, ఏప్రిల్ 7: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సంగమేశ్వరుడు శేష వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా కామాక్షీదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శేష వాహనంపై ఉంచి సంగం పుర వీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవానికి శాఖవరపు శ్రీహరి, శివకుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. గ్రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో దాతల సహకారంతో బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఉత్సవాలకు వచ్చే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

సీతారాముల గ్రామోత్సవం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోదండరామస్వామి ఆలయంలో సోమవారం స్వామివార్లను అశ్వ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.



నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

వింజమూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎర్రబెల్లిపాలెంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 8వ తేదీన అంకురార్పణ, 9న ధ్వజారోహణ, 10న పొన్నమాను సేవ, 11న హనుమంత సేవ, 12న గరుడసేవ, 13న కల్యాణం, 14న రథోత్సవం, 15న వసంతోత్సవం, 16వ తేదీ ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాంస్కృతిక, అన్న వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఈవోపీఆర్డీ



రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఈవోపీఆర్డీ భార్గవి సూచించారు. మండల కేంద్రంలోని బిట్-1 సచివాలయాన్ని ఆమె సోమవారం తనిఖీ చేసి సిబ్బంది హాజరు, పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో అందాల్సిన సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామనాథరెడ్డి, శిల్ప, వెల్ఫేర్ అసిస్టెంట్ హసానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఏపీవోగా శ్యామల బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఏపీవోగా ఎస్ శ్యామల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె జలదంకి నుంచి సీతారామపురానికి బదిలీపై వచ్చారు.

యువతకు ఉచిత శిక్షణ

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థలో యువతీ, యువకులకు కంప్యూటర్, సోలార్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 18 నుంచి 40 ఏళ్ల వయస్సు గలవారు 9441767176, 9908217465 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఆత్మకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

● రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మర్రిపాడు: కుట్టు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మర్రిపాడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం అని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ, ఈడబ్ల్యుఎస్ సహకారంతో ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కేంద్రాలను ఆయన సోమవారం ఆత్మకూరు నియోజకర్గ పరిధిలోని ఆత్మకూరు, మర్రిపాడు, సంగం మండలాల్లో ప్రాంభించారు. ముందుగా మర్రిపాడు మండలంలో, అనంతరం ఆత్మకూరు మున్సిపాల్టీలో, మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 రోజుల పాటు శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. ఈఏడాది పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి వందనం పథకాన్ని అమలుచేయనున్నామని తెలిపారు. త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20వేలు అందజేస్తామన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరికీ మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తా మన్నారు. ఆత్మకూరులో రూ. 56 కోట్లతో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రూ. 6.5 కోట్లు ఆత్మకూరు బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, ఈనిధులతో అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి రవితేజ కల్యాణ మండపం వరకు రోడ్డు, డివైడర్ నిర్మాణం చేపడతామని, ఆత్మకూరు జిల్లా వైద్య శాలను 300 పడకల వైద్యశాలగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి పావని, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మాలాదేవి, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దేవసేనమ్మ

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సమీపంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్ల అసోసియేషన్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం వ్యవసాయశాఖ ఏడీ దేవసేనమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

ఏఎస్ పేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా కనబడకుండా పోయిన రాజవోలు గ్రామానికి చెందిన విద్యార్థినిని సీఐ గంగాధర్ ఆమె తల్లికి అప్పగించారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి హైదారాబాదులో ఉన్నట్టు సమాచారం తెలుసుకున్న ఆయన విద్యార్థినిని ఆత్మకూరు స్టేషన్‌కు తీసుకొచ్చి తహసీల్దారు అనుమతితో కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు సీఐకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ షేక్ జమీలబేగం తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు

అనంతసాగరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు చెరువు పరిధిలోని పంట కాలువకు సంబంధించిన ఉప కాలువను కొందరు పూడ్చేసి నీరు రాకుండా అడ్డుకొంటున్నట్లు రైతులు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దారు సుభాషిణికి ఫిర్యాదుచేశారు. దీంతో తమ పొలాలు బీడుగా ఉంటున్నాయని, విచారించి న్యాయం చేయాలని కోరారు. అలాగే అదే గ్రామంలో పంచాయతీకి చెందిన మంచినీటి బావిని రేవూరు సంటయ్య అనే వ్యక్తి పూడ్చేసి ఆక్రమించాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయంలో ఏవో మస్తాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కర్నూల్‌కు బస్సు సర్వీసు ప్రారంభం

ఉదయగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిపో నుంచి కర్నూల్‌కు బస్సు సర్వీసును ప్రారంభించినట్లు సోమవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయగిరిలో ఉదయం 7 గంటలకు బయలుదేరి బద్వేలు, మైదుకూరు, నంద్యాల మీదుగా మధ్యాహ్నం 1.30 గంటలకు కర్నూల్‌కు చేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కర్నూల్‌లో బయలుదేరి రాత్రి 9 గంటలకు ఉదయగిరికి చేరుతుందన్నారు. కర్నూల్, నంద్యాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ బస్సు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీనియర్ సిటిజన్ సింగనబోయిన చెన్నకేశవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు పాలకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి



సీతారామపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, శేఖర్‌రాజు, తిరుపాల్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు మజీద్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల ఆధర్వంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో చిన్నయ్య, పిహెచ్‌ఎన్ రాజ సులోచన, సూపర్వైజర్లు రషీద్, కుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●వింజమూరు: కేఎంఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సుజాతనగర్ కాలనీలో మసీద్ వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ ఎన్ సుజన హాజరయ్యారు. విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాశిలామణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. అనంతరం సర్పంచ్ సుజనను సన్మానించారు. కార్య క్రమంలో డాక్టర్ ప్రశాంత్, స్నేహ, ప్రీతిక, నాయకులు ఖాజామస్తాన్, మాశిలామణి ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలి

ఉదయగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో చెరువు పైభాగంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని సోమవారం రైతులు తహసీల్దారు సుభద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన రీసర్వేలో కొందరు తమ పేర్లను రికార్డుల్లో నమోదు చేసుకుని పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారన్నారు. సర్వేచేసి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. స్పందించిన తహసీల్దారు వెంటనే మండల సర్వేయరును పిలిచి పరిశీలించి హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

భూ సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురు వినతులు సమర్పించారు. కాగా, ఎన్నిసార్లు అర్జీలు సమర్పించినా పరిష్కారం కావడంలేదని ఓ రైతు తహసీల్దారు సుభద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు జహీర్‌ఖాన్‌లపై వాదనకు దిగాడు. అలాగే పలువురు స్పందన కరువైందని వాపోయారు.